ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -354 పేజీలు - 8 వెల - 03/- శనివారం 11 ఏప్రిల్ 2026




## పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు , జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

# మంత్రులకు వార్నింగ్

- కేబినేట్ ఎజెండా ముందే లీక్
- కీలక అంశాలు సైతం ముందే వెల్లడి
- గతంలో ఇలా జరిగితే ఎన్టీఆర్ కేబినేట్ రద్దు చేశారు
- సమాచారం లీక్ అయితే అందుకు మంత్రులదే బాధ్యత
- కేబినేట్ భేటీలో సిఎం చంద్రబాబు సీరియస్ వార్నింగ్
- జలధార తదితర పథకాలపై ప్రచారం కల్పించాలని ఆదేశం



**అమరావతి,ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**
సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం దాదాపు 3 గంటలకు పైగా సాగింది. ఈ సమావేశంలో.. అమరావతికి ఆమోదంపై కేంద్రానికి, ప్రధాని మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలపడంతో పాటు.. కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది కేబినెట్.. అయితే, ఎజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత.. మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన సీఎం చంద్రబాబు.. కీలక సమాచారం లీక్ అవుతున్న అంశంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండాతో పాటు ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన వివరాలు ముందుగానే బయటకు ఎలా వస్తున్నాయంటూ మంత్రులను ప్రశ్నించారు. ఇకపై క్యాబినెట్ సమావేశానికి ముందే ఎజెండా లీకైతే సంబంధిత మంత్రులే బాధ్యత వహించాల్సి **మిగతా 2లో...**



# ప్రాజెక్టులకు ఆమోదం

- రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఆమోదం
- క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో మూడు సంస్థల ఏర్పాటు
- విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు
- విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపు
- సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాలు
- కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

**అమరావతి,ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో దాదాపు 3 గంటలకు పైగా కేబినెట్ భేటీ కొనసాగగా.. ముఖ్యంగా రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి మంత్రి మండలి ధన్యవాదాలు తెలియజేసింది. **మిగతా 2లో...**



# అందరి దృష్టి చర్చలపైనే

- నేడే అమెరికా-ఇరాన్ ప్రతినిధుల మధ్య కీలక చర్చలు
- పటిష్టమైన భద్రత నడుమ పాకిస్తాన్ రాజధాని
- లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం
- హంగేరీ నుంచి ఇస్లామాబాద్‌కు అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ బృందం

**ఇస్లామాబాద్ : ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**
శాంతి చర్చలకు ఇస్లామాబాద్ వేదికైంది. ఇప్పుడు అందరి దృష్టి చర్చలపైనే ఉంది. శుక్రవారం నాడే చర్చలు ప్రారంభమవుతాయని తొలుత ప్రకటించినా ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా శనివారం జరుగుతున్నాయి. ఇజ్రాయిల్ సైన్యం లెబనాన్‌పై దాడులు కొనసాగింస్తున్నందున ఇరాన్ ప్రతినిధి బృందం శుక్రవారం బయలుదేరలేదు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ హంగేరీ నుండి ఇస్లామాబాద్‌కు పయనమయ్యారు. అంతకు ముందు జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో మీడియాతో మాట్లాడుతూ "మేము సానుకూల చర్చలు జరపడానికి ప్రయత్నిస్తున్నాం, **మిగతా 2లో...**

# యూపీలో పడవ బోల్తా... 10 మంది యాత్రికులు మృతి..

- . ప్రధాని మోదీ దిగ్భ్రాంతి-మధురలోని యమునా నదిలో పడవ బోల్తా
- 14 మందిని కాపాడిన సహాయక బృందాలు



## రాయలసీమ ప్రాజెక్టులను
# చంపేసిన వైకాపా

- ఇప్పుడేమో మొసలి కన్నీరా
- ఎవరి హయాంలో ఎంత ఖర్చు చేశారో చర్చకు సిద్ధమా?
- మంత్రి పయ్యావుల కేశవ్ సవాల్



**అమరావతి,ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**
రాయలసీమ పేరును వైకాపా రాజకీయం కోసమే వాడుకుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాయలసీమలోని ప్రాజెక్టును చంపేసిన వైకాపా నాయకులు.. మొసలి కన్నీరు కార్చడం విడ్డూరమన్నారు. వైకాపా హయాంలో ఆగిన ప్రాజెక్టును తామెలా ఆపగలమని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాటలను వైకాపా నేతలు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టును ఆపింది తామేనన్న బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాటలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాయలసీమకు ఎవరి హయాంలో ఎంత ఖర్చు చేశారో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. మరోవైపు జగన్ నైజం చూసి..**మిగతా 2లో...**

# మావిగన్ పై ఐదేళ్లలో ఎందుకు మాట్లాడలేదు



- ఐదేళ్లలో రాజధాని కోసం ఒక్క ఇటుకైనా పేర్చారా
- ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం మొదలు పెట్టారు
- పులివెందులకు అవి గొడ్డలి పేరు పెట్టాలి
- అమ్మ విజయమ్మకు బొత్స బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- మీడియా ముందు జగన్‌ను ఏకి పారేసిన వైఎస్ షర్మిల

**విజయవాడ,ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**
ఏపీ రాజధాని అమరావతికి జగన్ పేరుతో 'మావిగన్' సరే.. పులివెందులకు అవినాశ్ పేరుతో ' అవి గొడ్డలి' అని పెట్టాల్సిందని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఎద్దేవా చేశారు. జగన్ పేరులో గన్ ఉందని, అవినాశ్ పేరులో వినాశనం ఉందన్నారు. ' ఎంతసేపూ నరకాలి.. చంపాలి.. నాశనం చేయాలి'**మిగతా 2లో...**

# అమరావతి అవినీతి గని

- నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ అమరావతిపై సజ్జల విమర్శలు
- అమరావతిలో సామాన్య ప్రజలు నివసించే పరిస్థితి లేదన్న సజ్జల
- ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చెప్పలేకపోతున్నారని విమర్శ



# సవాళ్లను స్వీకరించండి

- బెంగళూరు గ్రీన్‌వుడ్ హై స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో మంత్రి లోకేశ్
- సవాళ్లను స్వీకరించి లక్ష్యంపై దృష్టి పెట్టాలని యువతకు సూచన
- షార్ట్ కట్ల ప్రపంచంలో నైతికతే గొప్ప బలమని ఉద్బోధ



**ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**
యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలని, ట్రెండ్‌ను అనుసరించకుండా నిర్దిష్ట లక్ష్యంపై దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. బెంగళూరులోని సర్జాపూర్‌లో ఉన్న గ్రీన్‌వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ (గ్రేడ్-12) 2026 **మిగతా 2లో...**

# లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు..

- లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి నేత కేశాలు
- ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయారన్న డీజేపీ
- తెలంగాణలో నలుగురు మావోయిస్టులు మాత్రమే మిగిలిపోయారని వెల్లడి






# మహిళా రిజర్వేషన్లపై ఏకపక్ష ధోరణి

## ప్రతిపక్షాల విజ్ఞప్తులను విస్మరించిన ప్రభుత్వం : కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విమర్శ

**న్యూఢిల్లీ ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**
మహిళా రిజర్వేషన్‌పై మోడీ ప్రభుత్వం 'ఏకపక్ష' ధోరణి ప్రదర్శిస్తూ ప్రతిపక్షాల విజ్ఞప్తులను విస్మరించిందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విమర్శించింది. శుక్రవారం నాడిక్కడ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం (ఇందిరా భవన్)లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యూసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన, ప్రభుత్వ ప్రతిపాదనలపై చర్చించారు. అలాగే అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై తీర్మానాన్ని సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా ఆమోదించింది**మిగతా 2లో...**

# మంత్రులకు వార్నింగ్

**మొదటిపేజీ తరువాయి**

వస్తుందని స్పష్టంగా హెచ్చరించారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగా ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, అలాంటి పరిస్థితి మళ్లీ రాకూడదని చెప్పారు. ఎన్టీఆర్ ఎవరు లేకుండా 15 రోజులు ప్రభుత్వాన్ని నడిపారని సీఎం గుర్తు చేశారు. పేపర్ లీక్ కేసులో ఆ రోజు బాలయోగి రాజీనామా చేశారని చెప్పారు. ఇప్పుడు సాంకేతికతతో ఎవరి నుంచి లీక్ అయిందో తేలికగా కనుక్కోవచ్చని స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు బాధ్యతగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదేవిధంగా, ప్రభుత్వ పథకాల అమలుపై కూడా సీఎం మంత్రులకు పలు సూచనలు చేశారు. 'జలధార' పథకం గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. పాస్‌బుక్స్ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు, సంబంధిత మంత్రులు నెలకు కనీసం నాలుగు సార్లు ప్రాంతాల వారీగా పర్యటించాలని ఆదేశించారు. 'సూర్య ఘర్' పథకంపై మరింత దృష్టి పెట్టాలని, వచ్చే ఏడాదితో ముగియనున్న లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని మంత్రులకు నిర్దేశిరచారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే మహిళా బిల్లుపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. ఇక, రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మొత్తంగా, ఏపీ కేబినెట్‌లో లీకుల అంశంపై సీఎం చంద్రబాబు గట్టి హెచ్చరిక జారీ చేయడంతో పాటు, ప్రభుత్వ పథకాల అమలుపై స్పష్టమైన దిశానిర్దేశర చేశారు. అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. కేబినెట్ సమావేశం ప్రారంభమైనా అజెండా మాత్రం మంత్రులకు రాలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. అజెండా ముందే వస్తే స్టడీ చేసుకుని కేబినెట్‌కు వచ్చే వీలు ఉండేదన్నారు. దీంతో వివిధ శాఖల కార్యదర్శుల పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవస్థలు రాను రాను మరింత ఉపయోగపడాల్సింది పోయి క్లిష్టంగా మారుతున్నాయంటూ అధికారుల తీరను ముఖ్యమంత్రి తప్పుబట్టారు. కార్యదర్శులు గతంలో స్జబెక్టుల్లో భాగస్వాములవుతూ చర్చల్లో ఏ సందేహం వచ్చినా పూర్తిగా నివృత్తి చేసేందుకు చొరవ చూపేవారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఇప్పుడా పరిస్థితి లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఎక్కువ ప్రమోట్ చేయాలని సీఎం ఆదేశించారు. 10 ఎకరాలు తక్కువ కాకుండా నిబంధనలు పెట్టి నాణ్యత పెంచుతూ ఎక్కువ సంఖ్యలో డీమ్డ్ యూనివర్సిటీలను అందుబాటు లోకి తీసుకురావాలన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తక్కువ డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయని సీఎం తెలిపారు. జలధార, సూర్యఘర్, పీఎం కుసుమ్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను మంత్రులు ఓనర్ షిప్ తీసుకోవాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ప్రతి మంత్రి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి నాలుగు కార్యక్రమాల్లో అయినా పాల్గొనాలని ఆదేశించారు. కూటమి ఎమ్మెల్యేలూ ఇదే అనుసరించాలన్నారు. జలధారకు ఉపాధి హామీ నిధులు అనుసంధానం అయ్యేలా పనులు చేపట్టాలని సీఎం నిర్దేశిరచారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ కింద వీలైనన్ని ఎక్కువ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ ఉండాలన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధుల నివారణకు కృషి చేసేలా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రాజెక్టులకు ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

ఈ సమావేశంలో 16వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించిన పలు పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడనున్నాయి. అదేవిధంగా, క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా మూడు సంస్థల ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లే కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇక జోనల్ వ్యవస్థకు సంబంధించి కూడా కేబినెట్‌లో చర్చ జరిగింది. రాష్ట్ర పరిపాలనలో సమతుల్యత కోసం తీసుకునే చర్యలపై అధికారులు వివరాలు సమర్పించారు. పలు పరిశ్రమలు, సంస్థలకు భూ కేటాయింపుల విషయంలో కూడా కేబినెట్ అనుమతులు ఇచ్చింది. మొత్తం 60కి పైగా ఎజెండా అంశాలను పరిశీలించిన కేబినెట్, వాటిలో ముఖ్యమైన వాటికి ఆమోదం తెలిపింది. మొత్తానికి, ఈ కేబినెట్ సమావేశం రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం చేసే పలు నిర్ణయాలతో ముగిసిందని అధికారులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.36 లక్షల కోట్లు పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తద్వారా 9.62 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. సమావేశం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నం, అనకాపల్లిలో ఏఐ డేటా ప్రాజెక్టు అమలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. విశాఖలో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ స్థాపన కోసం సీటెక్ భూముల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం ఇచ్చింది. సత్యసాయి జిల్లాలో ఔట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ టెస్టింగ్ సౌకర్యం రానుంది. సత్యసాయి జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కోసం ఆర్ఆర్ ఎలక్ట్రానిక్స్‌కు 60 ఎకరాల కేటాయింపునకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐఐసీ, టీసీఎస్ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదం ఇచ్చారు. ఏపీఐఐసీ, రహేజా కార్ప్ సంస్థ మధ్య ఒప్పందంలో నిబంధనల సవరణకు ఆమోదంఇచ్చారు.

## రాయలసీమ ప్రాజెక్టులను చంపేసిన వైకాపా

**మొదటిపేజీ తరువాయి**

బొత్సకు భయంతో కూడిన బాధ వచ్చిందని మంత్రి పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు. బొత్స అన్న మాటలు గుర్తు చేయడం అచ్చెన్నాయుడి తప్పా అని ప్రశ్నించారు. వైఎస్ మరణం, బాబాయ్ వివేకా హత్యలో అంతిమ లబ్ధిదారు జగన్ కాదా అని వ్యాఖ్యానించారు.రాజకీయ అవసరాల కోసమే రాయలసీమను వైసీపీ వాడుకుంటుందని పయ్యావుల కేశవ్ విమర్శించారు. వైసీపీ హయాంలో రాయలసీమకు ఎంత ఖర్చు పెట్టారో ఆ పార్టీ నేతలు చెప్పాలన్నారు. రాయలసీమ మేలు కోసం వైసీపీ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాయలసీమపై పెట్టిన ఖర్చుపై చర్చకు సిద్ధమా? అంటూ ఆ పార్టీ నేతలకు ఆయన సవాల్ విసిరారు. రాయలసీమలో హార్టికల్చర్ హబ్ పెడతామని చెప్పాం.. తాము చేస్తామని స్పష్టం చేశారు. రాయలసీమ లిఫ్ట్‌పై స్టే విధిస్తే.. వైసీపీ ఏం చేసిందని ప్రశ్నించారు. వివాదాలు సృష్టించేందుకే వైసీపీ-బీఆర్ఎస్ కుట్రలని మండిపడ్డారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే ఏం చేశారంటూ ఆ పార్టీ నేతలను ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ నిలదీశారు. వైసీపీ మొసలి కన్నీరును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడి వ్యాఖ్యల్లో తప్పేముందని వైసీపీ నేతలను మంత్రి పయ్యావుల ప్రశ్నించారు. గతంలో బొత్స చెప్పిన మాటలనే మళ్లీ అచ్చెన్నాయుడు గుర్తు చేశారన్నారు. మీరు చెప్పిన మాటలనే గుర్తు చేస్తే.. ఉలుకెందుకు? అంటూ బొత్సను నిలదీశారు. జగన్ నైజం చూసి బొత్స సత్యనారాయణ బాధపడక ఏం చేస్తారు? అంటూ ఎద్దేవా చేశారు. భయంతో బొత్సకు బాధ కలిగిందేమో? అని వ్యంగ్యంగా అన్నారు. గుండెపోటు నుంచి గొడ్డలిపోటు వరకు.. తండ్రి మరణం నుంచి బాబాయ్ హత్య వరకు.. తల్లి విజయలక్ష్మి నుంచి చెల్లి షర్మిల ఆస్తి తగాదా వరకు.. జగన్ నైజమేంటో ప్రజలకు స్పష్టంగా తెలుసునని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

## సవాళ్లను స్వీకరించండి

**మొదటిపేజీ తరువాయి**

గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.షార్ట్‌కట్‌లతో నిండిన ప్రస్తుత ప్రపంచంలో నైతికతే గొప్ప బలమని లోకేశ్ అన్నారు. "కేవలం ఏం నేర్చుకున్నారన్నది కాకుండా, ఎలా ఆలోచిస్తున్నారనేదే అత్యంత ముఖ్యం. ఎవరూ చూడనప్పుడు మనం ఎలా ప్రవర్తిస్తామో అదే మన నిజమైన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది" అని విద్యార్థులకు హితవు పలికారు. లక్ష్య సాధనలో పట్టుదలతో ఉండాలని, ఎదురయ్యే అడ్డంకులను అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు.ఈ పర్యటన సందర్భంగా మంత్రి లోకేశ్ కీలక ప్రకటన చేశారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ పాఠశాల నడుస్తోందని, త్వరలోనే ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా విశాఖపట్నం అభివృద్ధిలో భాగస్వామ్యం కాబోతోందని వెల్లడించారు. గ్రీన్‌వుడ్ హై స్కూల్ అంతర్జాతీయ స్థాయిలో పౌరులను (గ్లోబల్ సిటిజన్స్) తయారు చేస్తుండటం గర్వకారణమని ఆయన ప్రశంసించారు.అంతకుముందు, పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్ కు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్కూల్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆర్ట్ గ్యాలరీ, తరగతి గదులను సందర్శించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన లోకేశ్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.

## యూపీలో పడవ బోల్తా... 10 మంది మృతి...

ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లాలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. బృందావన్‌లోని కేశీఘాట్ వద్ద యమునా నదిలో యాత్రికులతో వెళుతున్న పడవ బోల్తా పడటంతో 10 మంది మృతి చెందారు. మరో 14 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.వివరాల్లోకి వెళితే, పంజాబ్‌కు చెందిన సుమారు 30 మంది యాత్రికులు శుక్రవారం మధ్యాహ్నం పడవలో యమునా నదిలో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో పడవ అదుపుతప్పి నదిపై ఉన్న ఫ్లోటింగ్ పాంటూన్ వంతెన (పైపా బ్రిడ్జి)ను ఢీకొట్టింది. దీంతో పడవ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయింది. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 14 మందిని కాపాడి ఆసుపత్రికి తరలించగా, 10 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు యమునా నదిలో తీవ్రంగా గాలిస్తున్నాయి.ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం యోగి అధికారులను ఆదేశించారు. స్థానిక యంత్రాంగం బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అమరావతి అవినీతి గని

ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మిస్తున్న అమరావతి రాజధాని 40 ఏళ్లయినా పూర్తికాదని, అదొక అసాధ్యమైన ఆలోచన అని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ, అక్కడ కేవలం భవనాలు మాత్రమే ఉన్నాయి తప్ప జనం లేరని, అమరావతి పరిస్థితి కూడా అలాగే మారుతుందని ఆయన హెచ్చరించారు.

కేవలం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల కోసం విలాసవంతమైన బంగ్లాలు కడుతున్నారే తప్ప, సామాన్య ప్రజలు అక్కడ నివసించే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ స్థాయిలో రేట్లు పెట్టి... ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని చోటికి ప్రజలు ఎందుకు వస్తారని సజ్జల ప్రశ్నించారు.చంద్రబాబు అమరావతిని ఒక 'గ్రోత్ ఇంజిన్'లా కాకుండా, తన అవినీతికి తరగని గనిలా, అక్షయపాత్రలా వాడుకుంటున్నారని సజ్జల ఆరోపించారు. రాజధాని పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు తీసుకురావడం భావితరాలకు అన్యాయం చేయడమేనని మండిపడ్డారు. తన సొంత సంస్థ హెరిటేజ్‌ను నడిపేటప్పుడు తీసుకునే ఆర్థిక జాగ్రత్తలను, రాజధాని నిర్వహణలో చంద్రబాబు ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. అప్పుల ద్వారా వచ్చే నిధులతో ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చంద్రబాబు సూటిగా సమాధానం చెప్పలేకపోతున్నారని, ఆయన మాటల్లో డొల్లతనం కనిపిస్తోందని విమర్శించారు

# అందరి దృష్టి చర్చలపైనే

**మొదటిపేజీ తరువాయి**

ఇరానీయులు చిత్తశుద్ధితో చర్చలకు సిద్ధంగా ఉంటే, మేము కూడా తప్పకుండా స్వాగతిస్తాం," అని అన్నారు. మరోవైపు వాన్స్ ప్రకటన అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ ట్రూత్‌లో "ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పున్ణప్రారంభం" అని పోస్ట్ చేయడం గమనార్హం.

### ఆంక్షల నడుమ ఇస్లామాబాద్

పశ్చిమాసియాలో కాల్పుల విరమణ కొనసాగుతున్న నేపథ్యంలో నేడు అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరగనున్నాయి. దీంతో అందరి దృష్టి ఇస్లామాబాద్‌పై నిలిచింది. అక్కడ ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు జరిగాయి. పోలీసులు, మిలిటరీ, స్పెషల్ సర్వీస్ కమాండోలు నగరాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ముఖ్య రహదారులు, ప్రభుత్వ భవనాల వద్ద భద్రతా దళాలు గస్తీ కాస్తున్నాయి. నగరంలోని రెడ్ జోన్ ప్రాంతం కఠిన భద్రత కింద ఉంది.

### సాధారణ వాహనాలకు నో ఎంట్రీ

పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హొటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలు ఉన్న రెడ్ జోన్ ప్రాంతంలోని రహదారులు సాధారణ వాహనాలకు పూర్తిగా మూసివేశారు. పోలీసు బలగాలు నగరవ్యాప్తంగా చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశాయి. అధికార ప్రతినిధుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నారు. ఈ కీలక చర్చల ముందు ప్రజల ప్రజల రాకపోకలు తగ్గించేందుకు గురువారం, శుక్రవారం రోజులను ప్రభుత్వ సెలవులుగా ప్రకటించారు. పాఠశాలలు, దుకాణాలు మూతబడ్డాయి. కొద్ది చోట్ల మాత్రమే పరిమిత కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

### లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ దాడులు

ఒకవైపు చర్చల ప్రకియ జరుగుతుండగా, మరోవైపు ఇజ్రాయిల్ బరితెగించి లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తుంది. దక్షిణ లెబనాన్‌లో కార్‌వాష్ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుంటూ ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో ఆరుగురు మరణించారు. పలువురికి గాయాలయ్యాయి. అయితే అమెరికా-ఇరాన్ మధ్య కీలక చర్చల నేపథ్యంలో ఇజ్రాయిల్ తీరు ఆందోళనను కలిగిస్తున్నది. వారాల కాల్పుల విరమణ ప్రకటన వచ్చిన తర్వాత కూడా ఇజ్రాయిల్ దాడులకు తెగబడటం చర్చలకు ఆటంకంగా మారుతుందని పలుదేశాలు ఆందోళనవ్యక్తం చేస్తున్నాయి. అయితే ప్రతినిధి బృందం ఇంకా పాకిస్తాన్‌కు బయలుదేరలేదు. కాల్పుల విరమణ అనేది లెబనాన్ విషయంలో వర్తించదని ఇజ్రాయిల్ వాదిస్తోంది. కాగా అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్ తన బృందంతో హంగేరీ నుంచి ఇప్పటికే ఇస్లామాబాద్‌కు బయలుదేరారు.

### భద్రత కట్టుదిట్టం

పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మోహిసిన్ నక్వీ.. అమెరికా రాయబారికి పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 30 మంది సభ్యులతో కూడిన అమెరికా బృందం ఇస్లామాబాద్‌కు చేరుకుని భద్రతా ఏర్పాట్లను పరిశీలించింది. అయితే ఈ కీలక సమావేశాన్ని నిర్వహించే హోటల్ సెరీనా వద్ద భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ హోటల్‌ను ఉన్నతస్థాయి దౌత్య సమావేశాలకు వేదికగా ఉపయోగిస్తారు. కాగా వైట్ హౌస్ మాజీ ప్రెస్ సెక్రెటరీ ఎరీ ఫ్లీషెర్ ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు.

అయితే గగనతల భద్రతను కూడా కట్టుదిట్టం చేశారు. పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్ 1ఎల్-78 ట్యాంకర్లు, సి-130 విమానాలను మోహరించింది. ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ ప్రాంతం మీదుగా పాకిస్తాన్ యుద్ధ విమానాలు గస్తీ కాస్తున్నాయి. ఇవి ఇరాన్ ప్రతినిధి బృందం ప్రయాణించే విమానానికి భద్రత కల్పిస్తున్నాయి.

# మహిళా రిజర్వేషన్లపై ఏకపక్ష ధోరణి

**మొదటిపేజీ తరువాయి**

. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి, పార్లమెంటరీ సీట్ల సంఖ్యను పెంచాలన్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ ప్రతిపాదిత చర్య ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని విమర్శించారు. ఈ విషయంలో ప్రతిపక్షం ఐక్యంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు." ఈ సమావేశం అనంతరం, ప్రతిపక్షంలోని సహచరులందరితోనూ ఈ అంశాలపై చర్చించి ఓ సమిష్టి వ్యూహాన్ని రూపొందిస్తాం. అంతా ఐక్యంగా ముందుకు సాగుతాం" అని ఖర్గే అన్నారు. ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరగనున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల సమయంపై కూడా ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ప్రయోజనాలు, రాజకీయ లబ్ధి కోసమే ఇవన్నీ జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "మోడీ ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ది పొందాలనే ఉద్దేశంతోనే పార్లమెంట్ సమావేశాలను నిర్వహిస్తోంది. రాజ్యాంగ సవరణ బిల్లును అత్యంత తొందరగా ఆమోదింపజేయాలని ఆసక్తిగా ఉంది" అని ఖర్గే విమర్శించారు. ప్రతిపాదిత సవరణలు దేశ ఎన్నికల వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. కావున వాటిపై 'లోతైన చర్చ' అవసరమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు కేంద్రం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు."మాకు ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం, 2029 ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలని ప్రభుత్వం కోరుకుంటోంది. లోక్‌సభలోని సీట్ల సంఖ్యను 543 నుంచి 816కు పెంచాలని కూడా భావిస్తోంది" అని ఖర్గే అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేస్తూ "ఈ పునర్విభజన ప్రతిపాదన తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. అందువల్ల, పునర్విభజనపై లోతైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ ముగిసిన తరువాత అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్న ప్రతిపక్షాల అభ్యర్థనను ప్రభుత్వం పట్టించుకోలేదని ఖర్గే ఆరోపించారు. "ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమే.ఈ ఉల్లంఘనలను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకుంటుందని మేము ఆశించడం లేదు" అని అన్నారు. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్, జైరాం రమేష్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీసిఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖ్ పాల్గొని ఈ సమావేశంలో తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు.

## లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు..

### కీలక వ్యాఖ్యలు చేసిన తెలంగాణ డీజీపీ



తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు క్రమంగా తగ్గుముఖం పడుతుండగా, తాజాగా భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో మొత్తం 42 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను వదిలి ఈరోజు జనజీవన స్రవంతిలోకి చేరారు. లొంగిపోయిన వారిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ స్థాయి కలిగిన కేశాలు వంటి కీలక నేతలు ఉండటం విశేషం. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, గత ఏడాదిన్నర కాలంలోనే మొత్తం 763 మంది మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి ప్రభుత్వానికి లొంగిపోయారని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల కూంబింగ్ కార్యకలాపాలు ముమ్మరం కావడంతో, తమ రక్షణ కోసం మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారేనని, తెలంగాణకు చెందిన వారు కేవలం ఒక్కరే ఉన్నారని డీజీపీ స్పష్టం చేశారు. ఒకప్పుడు సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీల్లో తెలంగాణ వాసుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేదని, కానీ ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు. సెంట్రల్ కమిటీలో 11 మంది నుంచి ఇద్దరు, స్టేట్ కమిటీలో 24 మంది నుంచి కేవలం ఇద్దరు మాత్రమే మిగిలారని, వారు కూడా త్వరలోనే లొంగిపోవాలని ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన 42 మందికి పునరావాస ప్యాకేజీ కింద రూ. 1.93 కోట్ల నగదును అందజేయడంతో పాటు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారికి ప్రత్యేక ఆరోగ్య కార్డులను కూడా జారీ చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పునరావాస అవకాశాలను అందిపుచ్చుకుని, అడవి బాట పట్టిన వారంతా తిరిగి రావాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మావిగన్ పై ఐదేళ్లలో ఎందుకు మాట్లాడలేదు

**మొదటిపేజీ తరువాయి**

ఇదే వైకాపా సిద్ధాంతమని మండిపడ్డారు. నిండు సభలో విజయమ్మను అవమానించినందుకు బొత్స ఎంత ఏడ్చినా తక్కువేనన్నారు. మావిగన్.. ఎంతసేపూ గన్‌లు, గొడ్డళ్లేనా? ఐదేళ్లలో రాజధాని కోసం ఒక్క ఇటుక కూడా పెట్టలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చారు. ఇప్పుడు అమరావతి వద్దట.. మావిగన్ పెడతారట. పులివెందుల పేరు బదులు 'అవి గొడ్డలి' అని పెట్టండి. మావిగన్ అద్భుత ఆలోచనైతే.. ఐదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు అమలు చేయలేదు. మావిగన్‌కు తక్కువ ఖర్చు అయితే.. మూడు రాజధానులు ఎందుకన్నారు? జగన్ ఐదేళ్లు నిద్రపోయారా? మావిగన్ మీద మా వైఖరి అడుగుతున్నారు. ఎవరైనా జోక్ వింటే బిగ్గరగా నవ్వుతారు.. మా నవ్వే 'మావిగన్' మీదున్న అర్థం. అమరావతిపై కాంగ్రెస్ వైఖరి ఇప్పటికే స్పష్టంగా చెప్పాం. పార్లమెంట్‌లోనూ మద్దతిచ్చాం. అమరావతి కట్టడం కేంద్రం బాధ్యత అని చెప్పాం. విభజన హామీలు నెరవేర్చాలని చెప్పాం. అమరావతికి పూర్తి మద్దతిస్తున్నాం. నన్ను కూటమికి దత్తపుత్రిక అంటున్నారు. పచ్చకామెర్లు వచ్చినవాడికి లోకమంతా పచ్చగా ఉంటుందట. జగన్ మాత్రం భాజపాకి దత్తపుత్రుడు. ఆయన మోదీతో అక్రమ పొత్తు పెట్టుకున్నారు. వీళ్లు అలా చేశారు కాబట్టి.. అందరూ అలాగే ఉంటారనుకోవడం పొరపాటు. మేం వైఎస్సార్ ఐడియాలజీకి నిజమైన వారసులం. వైఎస్సార్ పేరు వాడుకునే హక్కు ఎవరికీ లేదు. ప్రజల పక్షాన పోరాటం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని అన్నారు.

ప్రజా రిపబ్లిక్

గురువారం 9 ఏప్రిల్ 2026

# గార్గేయపురం డంప్‌యార్డ్‌లో చెత్త శుద్ధీకరణ వేగవంతం చేయాలి

## బయో మైనింగ్ ద్వారా లెగసీ వ్యర్థాల నిర్మూలన - కలెక్టర్ డా. ఏ.సిరి ఆదేశాలు






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 10)**
నగరంలోని ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ గార్గేయపురం డంప్‌యార్డులో నిల్వ ఉన్న లెగసీ వ్యర్థాలను బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా త్వరితగతిన శుద్ధి చేసి, భూమిని పునర్వినియోగానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు.
శుక్రవారం నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్, మున్సిపల్ మరియు పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి దేవనగర్‌లోని మురుగు శుద్ధి కేంద్రం (ఎస్టీపీ), గార్గేయపురం డంప్‌యార్డును ఆమె పరిశీలించారు. డంప్‌యార్డులో సుమారు 15 ఎకరాల్లో పేరుకుపోయిన చెత్తపై బయో మైనింగ్, బయో రిమీడియేషన్ ప్రక్రియలను వేగవంతం చేసి, అందులో నుండి లభించే పదార్థాలను శాస్త్రీయంగా వర్గీకరించి వినియోగించాలన్నారు.
అదేవిధంగా, వేస్ట్ టు ఎనర్జీ యూనిట్, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) ప్లాంట్ల స్థాపనకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు దశకు తీసుకెళ్లాలని సూచించారు. దేవనగర్‌లోని ఎస్టీపీ నిర్వహణను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) ప్రకారం మెరుగుపరచాలని, శుద్ధి చేసిన నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. మౌలిక వసతుల నిర్వహణ బాధ్యతలను పబ్లిక్ హెల్త్ విభాగం నుంచి నగరపాలక సంస్థకు బదిలీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ గుర్రప్ప, డిఈ యూ. వెంకటేశ్వర్లు, ఏఈ నాగశేష, నగరపాలక ఎస్ఈ రమణమూర్తి, కార్యదర్శి నాగరాజు, ఎంఈలు గిరిరాజ్, డిఈఈలు పవన్, ఏఈ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు

# మృతి చెందిన వేంపెంట గ్రామ గూడెం సుదర్శనం కుటుంబానికి సింగపూర్ నాగేశ్వరరావు తరపున 5వేలు ఆర్థిక సహాయం అందించిన మాజీ సర్పంచ్ టేకూరి. రామసుబ్బమ్మ



**పాములపాడు ఏప్రిల్ 10 రిపబ్లిక్ న్యూస్:-**
పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో గూడెం సుదర్శనం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ పూలదండ వేసి, నివాళులు అర్పించారు. గూడెం సుదర్శనం కుటుంబానికి సింగపూర్ నుండి అంతర్జాతీయ సమాజ సేవకుడు & వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి.నాగేశ్వరరావు సంతాపాన్ని, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఆయన కుటుంబానికి సింగపూర్ నాగేశ్వరరావు తరపున 5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. సుదర్శనం మృతి పార్టీకి తీరని లోటని ధైర్యంగా ఉండాలని మీకు అన్ని విధాలుగా తోడుగా ఉంటామని ఆ కుటుంబానికి టేకూరి. రామసుబ్బమ్మ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ (డీసీ)ఆల్ఫ్రెడ్, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, ముద్దపాటి ప్రసాద్, నెత్తికొప్పుల రత్నాకర్, బోనాల భాస్కర్, సుబ్బరావు, దార జీవన్న, ఆంథోనీ, కొప్పుల సుధాకర్, కిరణ్, రాజకుమార్, ఏడిండ్ల ప్రవీణ్, మాడుగుల ఏసన్న,తదితరులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు వాహనాల పంపిణీ

## దాతృత్వం చాటిన ఎంపీ అంబికా

**అనంతపురం సంక్షేమం,**
**ఏప్రిల్ 10,( రిపబ్లిక్ న్యూస్ ):**



నగరంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశారు. శుక్రవారం పార్లమెంట్ సభ్యుల కార్యాలయంలో ఎంపీ చేతులమీదుగా వాహనాలను అందచేశారు. ఎంపీ నిధుల నుంచి ఈ మూడు చక్రాల వాహనాలను దరఖాస్తు చేసుకున్న నలుగురు విభిన్న ప్రతిభావంతులకు శుక్రవారం ఎంపీ అంబికా బండి తాళాలు ఇచ్చి, స్వీట్ పంచి వారి చేతికి వాహనాలు అందజేశారు. ఈ మూడు చక్రాల వాహనాలు అందుకున్న వారిలో షేక్ నబీ సాబ్, హరినాథ్ రెడ్డి, శ్రీకాంత్, శ్రీనాథ్ రెడ్డి అనే నలుగురు విభిన్న ప్రతిభావంతుల లబ్ధిదారులు ఉన్నారు.

**ఎంపీ అంబికా, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు**
షేక్ నబి సాబ్ అనే లబ్ధిదారుడు మాట్లాడుతూ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ఆర్థిక పరిస్థితిని గమనించి దరఖాస్తు చేసుకున్న వెంటనే ఈ మూడు చక్రాల వాహనం అందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, సూపరింటెండెంట్ అనిల్, సిఆర్ఓ నాగమోణి, తదితర ఎంపీ ఆఫీస్ సిబ్బంది, దివ్యాంగుల సంక్షేమ శాఖ సిబ్బంది, ఇతర విభిన్న ప్రతిభావంతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాల్వ గ్రామంలో పంచాయతీ చలేంద్రం ప్రారంభించడం జరిగింది. అలాగే 106 సేవల మనమిత్ర వాట్సాప్ గురించి అవగాహన కార్యక్రమం ఎంపీడీవో నాగ అనసూయ




**ఓర్వకల్లు ప్రతినిధి, ఏప్రిల్ 10,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామ పంచాయతీ యందు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది, అలాగే డోర్ టు డోర్ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ చేయడం జరిగినది, కరెంట్ బిల్ హౌస్ టాక్స్ ట్రైన్ టికెట్స్ తిరుమల టికెట్స్ ఇలాంటి 106 సేవలు వాట్సాప్ మనమిత్ర ద్వారా క్యూర్ కోడ్ స్కాన్ చేసి పేమెంట్ చేయొచ్చు అని కాల్వ పంచాయతీ నందు ప్రజలకు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి అవగాహన కల్పించడం జరిగింది,ఈ కార్యక్రమంలో కాల్వ పంచాయతీ సెక్రెటరీ మరియు సచివాల సిబ్బంది అతీవస్త్రం ఏపీవో పాల్గొనడం జరిగినది

# స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కండి

## సహచర మంత్రులకు లోకేశ్ సూచన



**అమరావతి,ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తి సన్నద్ధంగా ఉండాలని మంత్రి నారా లోకేశ్ సహచర మంత్రులకు సూచించారు. మంత్రులంతా పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉండాలని చెప్పారు. శుక్రవారం ఆయన పలువురు మంత్రులతో సమావేశమయ్యారు. ఎన్ని కార్యక్రమాలున్నా షెడ్యూల్ ప్రకారం పార్టీ కార్యాలయంలో ఒక రోజు అందుబాటులో ఉండి తీరాల్సిందేనని లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ ముఖ్యం అనే విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. విజ్ఞప్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, జువ్వెలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై వైకాపా విషప్రచారాన్ని తిప్పికొట్టాలని చెప్పారు. జాలర్ల ఉపాధి కల్పనకు వైకాపా అడ్డుతగులుతోందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా వైకాపా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం కల్పించేలా మంత్రులు చొరవ తీసుకోవాలని కోరారు.

# డయాగ్నొస్టిక్ బ్లాక్‌లో సేవల మెరుగుదలకు తక్షణ చర్యలు

## క్యూ పద్ధతి అమలు గర్భిణీల పరీక్షలు ఎం సి హెచ్ బ్లాక్‌కు మార్పు



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 10)**
స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాగ్నొస్టిక్ బ్లాక్‌లో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు తక్షణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు తెలిపారు. డయాగ్నొస్టిక్ బ్లాక్‌లో శాంపిల్ సేకరణ, నమూనాల పరిశీలన మరియు రిపోర్టుల పంపిణీ ప్రాంతాల్లో అధిక రద్దీ ఏర్పడటం, క్యూ పద్ధతి పాటించకపోవడం వల్ల రిపోర్టుల జారీ ఆలస్యమవుతున్నట్లు గుర్తించామని చెప్పారు.
ఈ సమస్యల పరిష్కారానికి డయాగ్నొస్టిక్ విభాగాధిపతులతో అత్యవసర సమావేశం నిర్వహించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు.
ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, శాంపిల్ రిపోర్టులు సేకరించేందుకు వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన క్యూ పద్ధతిని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు వరుస క్రమంలో సేవలు పొందేలా చర్యలు తీసుకోవడం ద్వారా గందరగోళం తగ్గి, సేవలు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు.
అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు సంబంధించిన రక్త నమూనాల సేకరణ, రిపోర్టులు మరియు సి బి పి వంటి పరీక్షలు ప్రస్తుతం డయాగ్నొస్టిక్ బ్లాక్‌లోనే జరుగుతున్నాయని, దీని వల్ల వారికి రద్దీ ప్రాంతాల్లో వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. వారి సౌకర్యార్థం ఈ సేవలన్నింటినీ త్వరలోనే మాతృ-శిశు ఆరోగ్య (ఎం సి హెచ్) బ్లాక్‌కు మారుస్తున్నామని చెప్పారు.
రిపోర్టులు ఆలస్యం కాకుండా ఉండేలా సిబ్బంది పనితీరును మెరుగుపరుస్తూ, పరీక్షలు పూర్తైన వెంటనే ఫలితాలు రోగులకు అందేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# రెచ్చిపోయిన దొంగలు.. రైతుల బెంబేలు

### భోజనం గ్రామం వద్ద 50 విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ

### బండి ఆత్మకూరు మండలంలో నిత్య కృత్యంగా కాపర్ వైర్ దొంగతనాలు

### దిక్కుతోచని స్థితిలో రైతన్నలు




**బండి ఆత్మకూరు, ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్ ):-**
రైతులు సాగునీటి కోసం అమర్చిన విద్యుత్ మోటార్ల వైర్లను కోసుకెళుతున్న దొంగల ముఠాతో రైతన్నలు బెంబేలెత్తిపోతున్నారు. గత 20 రోజుల వ్యవధిలోనే బండి ఆత్మకూరు మండల వ్యాప్తంగా మూడు,నాలుగు సార్లు వైర్లు కోసుకు వెళ్లి రైతాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున బండి ఆత్మకూరు మండలం, భోజనం గ్రామం వద్ద సుమారు 40 మంది రైతులకు చెందిన 50 మోటార్ల కాపర్ వైర్లు కోసుకువెళ్లారు. కోసుకెల్లిన వైర్లను సంత జూటూరు, భోజనం గ్రామాల మధ్య కుప్పలుగా పడేసి వాటిని ఒక్కొక్కటిగా విడదీసి అందులో ఉన్న కాపర్ వైర్ బయటకు తీసి కాఫర్ మాత్రమే ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన సముద్రాల అబ్రహం, వడ్డే రాముడు, కాండ్లపల్లి చిన్న ఉసేని, బ్రహ్మానందరెడ్డి, గోవిందరెడ్డి, సత్య నారాయణ, దిబ్బన్న, జింగిరన్న, నాగరాజు, సతీష్ బాబు, చిన్న ఉసేని, మనోహర్ లతో మరింత మంది విద్యుత్ మోటార్ల వైర్లను దుండగులు కోసుకువెళ్ళారు. దుండగులు విద్యుత్ మోటార్ల వైర్లు కోసిన విధానం చూస్తే ఒక ప్లాన్ ప్రకారం ముఠాగా ఏర్పడి వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఒక కిలోమీటర్ పరిధిలో సుమారు 50 విద్యుత్ మోటార్ల వైర్లను కోసుకు వెళ్లాలంటే చాలా సమయం పడుతుంది. అలాంటిది దొంగల ముఠా రాత్రికి రాత్రే కోసి వాటిని ఒక్కొక్కటిగా విడదీసి అందులో ఉన్న కాపర్ వైర్ ఎత్తుకెళ్లడం అనేది చూస్తే దొంగల చాకచక్కనికి నిదర్శనంగా కనిపిస్తుంది. బండి ఆత్మకూరు మండలంలో విద్యుత్ మోటార్ల కాఫర్ వైర్ దొంగతనాలు నిత్యకృత్యంగా మారాయి. ప్రతి నాలుగైదు రోజులకు ఒకసారి ఏదో ఒకచోట.. ఏదో ఒక గ్రామంలో వైర్లు కోసుకెళ్ళిన ఘటన తరచూ జరుగుతూనే ఉంది. అయినప్పటికీ పోలీసులు వారిని పట్టుకో లేకపోవడం మండల వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా పంట చివరి దశకు చేరుకోవడంతో మరో తడి నీరు ఫారాల్సి ఉంది. దీంతో బాధిత రైతులు దిక్కుతోచని స్థితిలో ఆందోళన చేతుతున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు రాత్రికి రాత్రే కుందు నది వెంట ఉన్న విద్యుత్ మోటార్ల వైర్లు కోసుకెళ్లడం మళ్లీ వేల రూపాయలు ఖర్చుపెట్టి కాపర్ వైర్ అమర్చుకోవాల్సిన సాగునీరు పారించుకోవలసిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు విద్యుత్ మోటార్ల కాపర్ వైర్ లు దొంగతనం చేసే దొంగల ముఠా పై దృష్టి సారించి రైతన్నలకు న్యాయం చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాపర్ వైర్ ఒక మీటరు రూ 95 రూపాయల నుంచి 120 రూపాయల వరకు ధర ఉంది. అలాంటిది ఒక్కో మోటారుకు ఒక్కో రైతు సుమారు 15 మీటర్ల నుంచి 30,40 మీటర్ల వరకు అమర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఒక రబీ సీజన్లోనే పంట చేతికి వచ్చేలోపు మూడు, నాలుగు సార్లు దొంగతనం జరగడం రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వరుస దొంగతనాలపై బాధిత రైతులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## సమాజ మార్పులో ఇన్ఫ్లుయెన్సర్ల పాత్ర కీలకం జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 10)**
ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు.
శుక్రవారం కలెక్టరేట్‌లో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంపై ప్రభావం చూపగల శక్తి సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లకు ఉందని, ఆ శక్తిని సమాజ హితానికి వినియోగించాల్సిన బాధ్యత ఉందన్నారు.
ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విజయగాథలను ప్రజలకు చేరవేయడంతో పాటు బాల్య వివాహాలు, అక్షరాస్యత పెంపు, బహిరంగ మల విసర్జన నిర్మూలన వంటి సామాజిక సమస్యలపై అవగాహన కల్పించాలని సూచించారు.
అలాగే ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడం ద్వారా భూమి సారాన్ని పెంచి మంచి దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించాలని సూచిస్తూ, సమాజ అభివృద్ధి, విద్యా విస్తరణ, సామాజిక సమస్యల పరిష్కారంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ పాల్గొన్నారు.

# సీమ ప్రయోజనాలను కాపాడుకుందాం

'సీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు నిలిపివేయడం పెద్ద కుట్ర

వైఎస్ఆర్ చొరవతోనే రాయలసీమకు కృష్ణా జలాలు

హంద్రీనీవా ప్రధాన కాలువను వెడల్పు చేయాలి

డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసి ఆయకట్టుకు నీరివ్వాలి

బాబు స్కీముల్లో .. అన్నీ స్కాములే..!

సీమ సాగునీటి ప్రాజెక్టులుసమాలోచన సదస్సులో వైసీపీ నేతలు



**అనంతపురం ప్రతినిధి, ఏప్రిల్ 10,( రిపబ్లిక్ న్యూస్ )** రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను తక్షణం పూర్తి చేయడంతో పాటు హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. రాయలసీమ హక్కుల కోసం గ్రామ స్థాయి నుంచి పోరాటం మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులుసమాలోచన పేరుతో అనంతపురంలోని గుత్తిరోడ్డులో ఉన్న కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ వ్యవసాయశాఖ మంత్రి, నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ సాకే శైలజానాథ్, వైసీపీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు తలారి రంగయ్య, మెట్టు గోవిందరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు, పీఏసీ, సీఈసీ, ఎస్ఈసీ సభ్యులు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్టీ రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, జిల్లా పార్టీ కమిటీ సభ్యులు, నగర, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఇతర నాయకులు హాజరయ్యారు.


**బాబుకు అమరావతి బంగారు బాతులా మారింది**

ఈ సందర్భంగా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు వైఖరిని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి తూర్పారపట్టారు. రాయలసీమపై చంద్రబాబుకు ఎందుకంత చులకన అని ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను అర్థాంతరంగా నిలిపివేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటల మేరకే ఈ ప్రాజెక్టు పనులు ఆపేశారన్న వ్యాఖ్యలపై చంద్రబాబు ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని విమర్శించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సీమలోని ఇతర ప్రాజెక్టులకు ఇన్సూరెన్స్‌లా పనిచేస్తుందని పేర్కొన్నారు. చంద్రబాబు మిషన్ అంటే అందులో కమీషన్ ఉంటుందని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పని ఎక్కువ.. ప్రచారం తక్కువని.. కానీ, చంద్రబాబుకు పని తక్కువ ప్రచారం ఎక్కువ అని చురకలంటించారు. చంద్రబాబుకు అమరావతి అనేది బంగారు బాతులా మారిపోయిందన్నారు.



**సాగునీటి సంఘాల పేరుతో దోపిడీకి సిద్ధం**

గతంలో నీరు చెట్టు పేరుతో నిధులు దోచుకున్నారని, ఇప్పుడు కూడా నీటి భద్రతసాగునీటి సంఘాల బాధ్యత పేరుతో మరోసారి దోపిడీకి సిద్ధమయ్యారన్నారు. వ్యవసాయ అంటేనే దండగ అని చెప్పే చంద్రబాబు ఎప్పుడు సీఎంగా ఉన్న రైతులకు అన్యాయమే జరుగుతోందన్నారు. రైతులు, వ్యవసాయం గురించి ఆలోచించిన ఒకే ఒక్క నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు మెడలు వంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయించుకుందామన్నారు.





**రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలి**

వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధికి కీలకమైన రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని, సీమ ప్రజల ప్రయోజనాల కోసం పోరుబాటను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. రాయలసీమపై ముఖ్యమంత్రి నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. హంద్రీనీవా పనులకు చంద్రబాబు శంకుస్థాపనలు చేయడం మినహా చేసిందేమీ లేదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ముఖ్యమంత్రి అయ్యాక పనులు పరుగుపెట్టాయని, ఈ క్రమంలోనే 2012 నుంచి కృష్ణా జలాలు అనంతపురం జిల్లాకు వచ్చాయని గుర్తు చేశారు.

**హంద్రీనీవా ద్వారా 3.50 లక్షల ఎకరాలకు సాగునీరు**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక హంద్రీనీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచుతూ జీవో జారీ చేసి టెండర్లు కూడా పూర్తి చేశారన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక మరోసారి హంద్రీనీవాను కుదించి అన్యాయం చేశారన్నారు. హంద్రీనీవా ద్వారా 3.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. కానీ ఒక్క ఎకరా ఆయకట్టుకు అందించడం లేదని మండిపడ్డారు. డిస్ట్రిబ్యూటరీలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. గతంలో హంద్రీనీవాను 40 టీఎంసీల నుంచి 5 టీఎంసీలకు పరిమితం చేసిన చరిత్ర చంద్రబాబుదని, ఇప్పుడు కూడా 6300 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కులకు కుదించి నిధులు దోపిడీ చేశారని విమర్శించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు ఎంతో దూరదృష్టితో వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. అమరావతి రాజధాని పేరుతో ఒకే చోట నిధులు ఖర్చు పెడితే వెనుకబడిన ప్రాంతాల పరిస్థితి ఏంటని అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర విభజనకు ముందు



తొమ్మిదిన్నరేళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు రాయలసీమ ప్రాజెక్టులను పునాదిరాళ్లకు మాత్రమే పరిమితం చేశారని దుయ్యబట్టారు. అందరూ కలిసికట్టుగా రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. రాయలసీమ అభివృద్ధి కోసం గతంలో బీజేపీ రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించి ఇప్పుడు మౌనంగా ఉండడం ఏంటని ప్రశ్నించారు. సీమ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**854 అడుగుల స్థాయిలో నీరు తరలించడం సాధ్యం కాదు**

ప్రోగ్రాం కో ఆర్డినేటర్, మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ తెలంగాణకు తమకు వ్యతిరేకత లేదని, అయితే అక్కడి సీఎం చెప్పారని ప్రాజెక్టు పనులు నిలిపివేయడం దుర్మార్గమని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తయితేనే శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తగిన స్థాయిలో నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం 854 అడుగుల స్థాయిలో నీరు తరలించడం సాధ్యం కాదని, ఈ ప్రాజెక్టు ద్వారా నీటి వాటాలను కాపాడుకోవచ్చని తెలిపారు.

**వేల కోట్ల రూపాయల బిల్లులు ఎందుకు చెల్లించారు**

వైసీపీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, సమన్వయకర్తలు రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ,



పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకుల్‌నాథ్‌రెడ్డి, కేవీ రమణ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై చంద్రబాబు మౌనం అనుమానాస్పదమని అన్నారు. ఒకవైపు ఈ ప్రాజెక్టును "దొంగ ప్రాజెక్టు" అని అంటూనే, మరోవైపు వేల కోట్ల రూపాయల బిల్లులు ఎందుకు చెల్లించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితేనే రాయలసీమ ప్రాజెక్టులకు నీరు అందుతుందని పేర్కొన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వంపై పోరాటాలు కొనసాగించాలన్నారు. రాయలసీమకు సాగు, తాగు నీటి విషయంలో జరుగుతున్న అన్యాయంపై ఐక్య ఉద్యమాలే మార్గమని స్పష్టం చేశారు. రాయలసీమలో సాగు, తాగునీటి సమస్యలను తీర్చిన ఘనత వైయస్ రాజశేఖరరెడ్డిదేనని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో వైయస్ జగన్ మోహన్ రెడ్డి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టారని పేర్కొన్నారు. అయితే రాయలసీమకు అడుగడుగునా అన్యాయం చేసిన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని విమర్శించారు. హైకోర్టు, ఎయిమ్స్ వంటి కీలక ప్రాజెక్టులను ఇతర ప్రాంతాలకు తరలించడం ద్వారా సీమ అభివృద్ధిని దెబ్బతీశారని ఆరోపించారు. రాయలసీమ అభివృద్ధిపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు చిత్తశుద్ధి ఉందా అని ప్రశ్నించారు. రాయలసీమ ప్రజలు టీడీపీ కూటమికి పట్టం కట్టినప్పటికీ, ప్రస్తుతం ఆ ప్రభుత్వం చేస్తున్న పనులు ప్రజలను నిరాశపరుస్తున్నాయని అన్నారు. అందరూ కలిసికట్టుగా ప్రభుత్వం మెడలు వంచి రాయలసీమ ప్రయోజనాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

# వ్యవసాయ అభివృద్ధికి ట్రాక్టర్ నగర్ కీలకం

## ట్రాక్టర్ నగర్ సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్

**శింగనమల (వ్యవసాయం),ఏప్రిల్ 10,( రిపబ్లిక్ న్యూస్ ):** శింగనమల మండలం ఆకులేడు (గార్లదిన్నె వద్దనున్న) పరిధిలోగల దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)ను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పరిశీలించారు.ఈ సందర్భంగా దక్షిణ ప్రాంత వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షా సంస్థ యొక్క మౌలిక సదుపాయాలు, శిక్షణా తరగతి గదులు, శిక్షణా ప్రయోగశాలలు, వివిధ కట్-మోడల్స్, డ్రోన్ ప్రయోగశాల, టెస్టింగ్ ల్యాబ్‌లు, ఇంజన్ టెస్ట్ ల్యాబ్‌లు, ప్లాంట్ ప్రొటెక్షన్ టెస్ట్ ల్యాబ్‌లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ట్రాక్టర్ ఆపరేటెడ్ ఏరో బ్లాస్ట్ స్ప్రేయర్, బూమ్ టైప్ స్ప్రేయర్ వంటి వివిధ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గల వ్యవసాయ యంత్రాలు, పరికరాలను సిబ్బంది, సభ్యులు ప్రదర్శించారు. ఇందులోభాగంగా అకడమిక్ ట్రైనింగ్ కోర్సు శిక్షణార్థులతో (మహారాష్ట్ర) జిల్లా కలెక్టర్ సంభాషించారు. అలాగే సమీప గ్రామాల రైతులతో కూడా మాట్లాడి, శిక్షణ పొందుతున్న వారికి, రైతులకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

**రైతులకు, నిరుద్యోగ యువతకు ప్రయోజనం**

ఈ సంస్థలో నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి, క్షేత్రేతర శిక్షణ మరియు ప్రదర్శన కార్యక్రమాల ద్వారా రైతులు, ఇతర



భాగస్వాములలో వ్యవసాయ యాంత్రీకరణను ఎలా ప్రోత్సహించవచ్చో, అలాగే సంస్థ యొక్క కార్యకలాపాలు, విజయాల గురించి ఎస్ఆర్ఎఫ్ఎమ్టిటిఐ డైరెక్టర్ డాక్టర్ పి.పి.రావు వివరించారు. ఆర్పిటిఓ ల్యాబ్, మొక్కల రక్షణ, బ్యాటరీ/ఎలక్ట్రిక్ ఆపరేటెడ్ టెస్ట్ ల్యాబ్ వంటి పూర్తయిన వివిధ నిర్మాణ పనుల గురించి, అలాగే హై-టెక్ తరగతి గదులు, బాలికల హాస్టల్, బాలుర హాస్టల్, ఆడిటోరియం వంటి నిర్మాణంలో ఉన్న పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎఫ్ఎమ్టిటిఐ డైరెక్టర్ డాక్టర్ పి.పి.రావు నాయకత్వంలో చేపట్టిన కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయి వ్యవసాయ యాంత్రీకరణలో ఈ సంస్థ అందించే శిక్షణ, ప్రదర్శన, పరీక్షా సేవల నాణ్యతకు, అలాగే దాని నిపుణుల నైపుణ్యానికి గాను ఎస్.ఆర్.ఎఫ్.ఎం.టి.ఐ., గార్లదిన్నె ఇన్స్టిట్యూట్ ఒక విశిష్టమైన సంస్థ అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి వ్యవసాయ యాంత్రీకరణలో ఈ సంస్థ నిర్వహిస్తున్న వివిధ శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకోవడం ద్వారా అనంతపురం జిల్లాలోని రైతులకు, నిరుద్యోగ యువతకు ఈ సంస్థ ఎలా ప్రయోజనం చేకూరుస్తోందో కూడా వివరించారు. గార్లదిన్నెలోని ఎస్ఆర్ఎఫ్ఎమ్టిటిఐని బలోపేతం చేయడానికి డైరెక్టర్, బృందం చేస్తున్న నిరంతర కృషికి జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో ప్రభాకర్ నాయక్



**గుత్తి ఏప్రిల్ 10 :(రిపబ్లిక్ న్యూస్ )** అనంతపురం జిల్లా గుత్తి మండలం యంగన్నపల్లి గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనులను ఎంపీడీవో తనిఖీ చేశారు. పనుల వద్ద శ్రామికుల హాజరు పట్టికను పరిశీలించిన ఆయన, శ్రామికులు ఫేస్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రభాకర్ నాయక్ మాట్లాడుతూ ఫేస్ యాప్ ద్వారా ఉపాధి హామీ పనులు అవినీతిని అరికట్టవచ్చని, తద్వారా అర్హులైన నిజమైన శ్రామికులు ప్రభుత్వం నుండి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్ శ్రామికులు పాల్గొన్నారు

# అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట వస్తువుల పంపిణీ



**శ్రీ సత్యసాయి సంక్షేమం, ఏప్రిల్ 10, (రిపబ్లిక్ న్యూస్):**పుట్టపర్తిలో కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలు నందు పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా జిల్లా అభివృద్ధికి రూ. 20 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 395 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన ప్లే మెటీరియల్ (ఆట వస్తువుల) కిట్లను జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్యే పల్లె సింధుర రెడ్డి శనివారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల మేధో వికాసానికి, శారీరక ఎదుగుదలకు ఈ ఆట వస్తువులు ఎంతో దోహదపడతాయి.హబ్ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ కిట్లను పంపిణీ చేయడం జరుగుతుంది.ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించి, పిల్లలు సురక్షితంగా ఆడుకునేలా నాణ్యమైన వస్తువులను అందించడంపై అవగాహన కల్పించాలి. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ప్రమీల, డిసిపిఓ మహేష్, నోడల్ ఆఫీసర్ గాయత్రి పాల్గొన్నారు.

# కామ్రేడ్ కానూరుకు విప్లవ జోహార్లు

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 10,( రిపబ్లిక్ న్యూస్ ):** కామ్రేడ్ కానూరు వెంకటేశ్వరరావు విప్లవ భావజాలానికి ప్రతీక. కానూరు వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు.అనంతపురం రూరల్ పరిధిలోని రాజీవ్ గాంధీ పంచాయతీ భగత్ సింగ్ నగర్‌లో కామ్రేడ్ కానూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ నాగరాజు, జిల్లా అధ్యక్షులు నాగభూషణం, జిల్లా కమిటీ సభ్యుడు గంగాధర్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, జిల్లా కోశాధికారి రాయుడు, ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రి స్వామి, పట్టణ పేదల సంఘం నాయకులు వీరనారప్ప, ఫక్రుద్దీన్, కటారి రాజు, మున్నా, ప్రగతిశీల



మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు వరలక్ష్మి, భగత్ సింగ్ నగర్ కమిటీ కన్వీనర్ మాదాపురం నరేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే దళిత విముక్తి సంఘం జిల్లా నాయకుడు పెద్దన్న హాజరై నివాళులు అర్పించారు.

**రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన అజేయుడు**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కామ్రేడ్ కానూరు వెంకటేశ్వరరావు పీడిత ప్రజల కోసం, కార్మికుల, రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన అజేయ యోధుడని పేర్కొన్నారు. ఆయన జీవితం త్యాగం, పోరాటం, నిబద్ధతలకు నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. సమాజంలో అసమానతలు తొలగించేందుకు ఆయన చూపిన మార్గం నేటికీ మార్గదర్శకమని తెలిపారు.ప్రజాసంఘాల నాయకులు ఐక్యంగా సామాజిక న్యాయం సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్ ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని స్పష్టం చేశారు. విప్లవ జోహార్లతో ... కామ్రేడ్ కానూరు వెంకటేశ్వరరావు గారి స్మృతులను నాయకులు స్మరించుకున్నారు.

## పేద కుటుంబానికి అండగా నిలిచిన ఆలూరు ఎమ్మెల్యే బుసినే వీరుపాక్షి



**చిప్పగిరి, ఏప్రిల్, 10 (రిపబ్లిక్ న్యూస్ )** పేద కుటుంబానికి ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బుసినే వీరుపాక్షి అండగా నిలిచారు,వివాహానికి సహాయం మానవత్వం చాటారు, ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలం దేగులపాడు గ్రామానికి చెందిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆంజనేయులు సోదరుడు కుమారుడు వివాహానికి ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి శుక్రవారం తన వంతు సహాయంగా తాళిబొట్టు, కాలిమెట్లు అందజేశారు, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను అందజేసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు




**కర్నూలు ప్రతినిధి, ఏప్రిల్ 10,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ముఖ్యమంత్రి సహాయ నిధిపేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కర్నూలుఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయన పంచలింగాల గ్రామంలో ని తన నివాసంలో లబ్దిదారులకు అందజేశారు...ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేద ప్రజలకు సీ.ఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు దేవశంకర్ పాల్గొన్నారు

# అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న గువ్వల రమేష్ రెడ్డి



**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 10 రిపబ్లిక్ న్యూస్**
మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి పాల్గొన్నారు.బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న రాహుకాల అభిషేకంలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు అనంతరం గోశాలను సందర్శించారు. వేసవిలో గోవులకు నీరు మేత సమస్య లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. దిగువపల్లి పంచాయతీ ఆర్ఆర్ కాలనీ నందు నూతనంగా ఏర్పాటుచేసిన శుద్ధ జల యంత్రాన్ని ఆయన ప్రజలకు అంకితం చేశారు. దశాబ్దాలు తరబడి నెలకొని ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మేకల వారి పల్లి ఉన్నత పాఠశాలలో అదనపు భవనం కోసం భూమి పూజ చేశారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు బోయకొండ సుబ్బు, సుజేయన్, రాజు, హమీద్ ఖాన్, కుమార్ రెడ్డి, సోము, రాధాకృష్ణ ,పాఠశాల ఉపాధ్యాయ బృందం నాయకులు పాల్గొన్నారు.


## గోశాల నిర్వహణకు రూ 30వేలు విరాళం



**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 10 రిపబ్లిక్ న్యూస్**
శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గోశాల నిర్వహణకు చౌడేపల్లి కి చెందిన దాత రూ 30 వేలను విరాళంగా అందించారు. చౌడేపల్లి పట్టణం మోటారు వీధికి చెందిన శ్రీనివాసులు గోశాల కోసం నగదును ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరంకు అందించారు. ఈ సందర్భంగా దాతలను సాదరంగా ఆహ్వానించి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ అధికార సిబ్బంది పాల్గొన్నారు.

## పుల్లంగి ఏరు లో గుర్తు తెలియని యువకుడు మృతి

**ఓబులవారిపల్లి ఏప్రిల్ 10 రిపబ్లిక్ న్యూస్.**



రైల్వే కోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట మండలం పుల్లంగి ఏరులో గుర్తుతెలియని యువకుని శవం లభ్యమైనట్లు శుక్రవారం పుల్లంపేట సబ్ ఇన్స్పెక్టర్ పి చిన్న రెడ్డప్ప తెలియజేశారు, మృతుడు గురువారం రాత్రి చనిపోయి ఉండవచ్చని ఆయన అన్నారు శుక్రవారం స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనపరచుకొన్నామని, శివ పంచనామా నిర్వహించి అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రైల్వే కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు, మృతునికి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉండవచ్చు అన్నారు, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు మృతిని మరణానికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు, స్థానికుల సమాచారం మేరకు మృతదేహం యువకుడిది కనుక ప్రేమ విఫలమో, పాత కక్షలో, లేక ఏవైనా మాదకద్రవ్యాలు తీసుకొని శృతిమించడం వలన ప్రమాదవశాత్తు ఈ ఘటన జరిగి ఉండొచ్చని, లేక స్నేహితుల మధ్య గొడవ జరిగి హత్య గావింపబడి శవాన్ని ఈ ఏరులో పడేసారేమోఅని, ఇది హత్య లేక ఆత్మహత్య అనుమానం వ్యక్తం చేస్తున్నారు,ఏదేమైనా శవం ఎక్కడిదో ఎలా చనిపోయాడు వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలుస్తుందని ఉన్నారు, తరచూ ఇలాంటి ఘటనలు జరగడం స్థానికులు కలకలం రేపుతోందన్నారు,ఇటీవల ఓబులవారిపల్లి మండలం కడప చెన్నై జాతీయ రహదారి చిన్నఓరం పాడు లో తల లేని శవం రోడ్డు ప్రమాదంలో లభ్యమైందని దాని తల ఆచూకీ కూడా ఇంతవరకు లభ్యమైనట్లు తెలియడం లేదు ఏదేమైనా ఇలాంటి ఘటనలు సమాజంలో తరచూ జరగడం ఆందోళన కలిగిస్తుందన్నారు.

## ఎస్ అండ్ ఆర్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా డాక్టర్ పి పెంచలయ్య నియామకం



**ఓబులవారిపల్లి ఏప్రిల్ 10 రిపబ్లిక్ న్యూస్.** సమాజంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ నిరుపేద ప్రజలకు జరుగుతున్న అన్యాయ అక్రమాల సమస్యలపై అలుపెరుగని పోరాటం, సామాజిక న్యాయపోరాటాలు సత్ఫలితాలు ఇస్తున్న సందర్భముగా హెచ్ఆర్ఏసిఏ డాక్టర్ పెంచలయ్య సేవలను గుర్తించి ఆయనకు ఎస్ అండ్ ఆర్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా డాక్టర్ పెంచలయ్యను నియమించడం జరిగినది, సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ మాకు అప్పగించిన ఈ బాధ్యతను మానవ హక్కులను పరి రక్షించడానికి ప్రజల తరఫున న్యాయపోరాటం చేయడానికి మరొక్క బృహత్తర బాధ్యతలను అప్పజెప్పినందుకు ఎస్ అండ్ ఆర్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ ఎన్జీవో సమస్త కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని డాక్టర్ బి పెంచలయ్య విలేకరుల సమావేశంలో శుక్రవారం చెప్పడం జరిగినది. అదేవిధంగా తిరుపతి జిల్లా జనరల్ సెక్రెటరీగా ఓబులవారిపల్లి మండలం జీవీపురం గ్రామపంచాయతీకి చెందిన తిరుమల కొండు బాలకృష్ణ యాదవ్ నియామకం జరిగింది. అదేవిధంగా వైయస్సార్ కడప జిల్లా అధ్యక్షులుగా భూషి పాటి బాలచంద్రాను నియమించడం జరిగినది. అందరూ కూడా మానవ హక్కుల పరిరక్షణ కొరకు పాటుపడతామని ముక్తకంఠంతో చెప్పడం జరిగినది.

## గల్ఫ్ నుంచి తెలుగు వారి కోసం ఫ్లైట్

### ముందుకు వచ్చిన జజీర ఎయిర్ లైన్స్




**విజయవాడ,ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):** పశ్చిమాసియాలో యుద్ధంతో గల్ఫ్‌లో చిక్కుకుపోయిన తెలుగువారు స్వదేశానికి రావడానికి కొత్త విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయి. యుద్ధానికి రెండు వారాల పాటు విరామం లభించడంతో సౌదీ అరేబియాలోని దమ్మమ్ నుంచి, విజయవాడ మధ్య రిలీఫ్ ఫ్లైట్స్ నడపడానికి జజీరా ఎయిల్‌లైన్స్ సిద్ధమైంది. ఈనెల 13 నుంచి 29 వరకు ఆ ప్రత్యేక సర్వీసులు నడపనుంది. ఈ మేరకు విజయవాడ విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇవ్వటంతో పాటు స్లాట్‌ను బుక్ చేసుకుంది. సోమ, బుధ, శుక్రవారాల్లో ఆ విమానాలు నడుస్తాయి. ఎయిర్‌పోర్టు అధికారులకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం విజయవాడ, దమ్మమ్‌ల మధ్యనే విమానాలు నడుస్తాయి. దమ్మమ్‌కు చేరాక అక్కడి నుంచి కువైట్‌కు కూడా ఈ సర్వీసులు వెళ్లనున్నట్టు తెలుస్తోంది.

------

# శివాజీ మహారాజ్, జ్యోతిబా పూలే, అంబేద్కర్ జయంతుల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 10)**
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్, జ్యోతిబా పూలే, అంబేద్కర్ జయంతుల వారోత్సవాలు గుత్తి పట్టణంలోని జంగాల కాలనీలో ఘనంగా నిర్వహించబడినవి. ఈ కార్యక్రమం మండల అధ్యక్షురాలు తాటికొండ సుంకమ్మ ఆధ్వర్యంలో, తాటికొండ దేవా అధ్యక్షతన జరిగింది.





ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఇందిరా దేవి, భారతీయ భీమ్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జై భీమ్ రామాంజనేయులు, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ గుత్తి ఇంచార్జి మద్దిలేటి, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, జిల్లా కార్యదర్శి ఈరన్న, బహుజన రాజ్యాధికార జేఏసీ అధ్యక్షుడు ఆదినారాయణ, బీఎస్పీ నాయకుడు గ్రానైట్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ, మహనీయుల ఆలోచనా విధానాన్ని అనుసరించి బహుజనులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వారు చేసిన త్యాగాలను మర్చిపోకుండా, చూపిన మార్గంలో నడవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో గార్లదిన్నె మండల మహిళా ఐక్య వేదిక అధ్యక్షురాలు ఈబూది కుళ్లాయమ్మతో పాటు పద్మావతి, రమాదేవి, రామాంజినమ్మ, కురువ లక్ష్మీ, తాటికొండ జమ్మక్క, తాటికొండ లక్ష్మీ, తాటికొండ నరసమ్మ, ఈబూది సువర్ణ, ఈబూది నాగమ్మ, లక్ష్మీదేవి, మద్దక్క, జేంపు స్టీఫెన్, ఈబూది సుంకయ్య, తాటికొండ కట్టప్ప, స్వతంత్ర కుమార్, మాథ్యూస్, తాటికొండ చిన్న కుళ్లాయప్ప, కల్లూరు ఎర్ర రైతు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజాదర్బారులో ప్రజా సమస్యల పరిష్కారం

## కూడా చైర్మన్ రూపనంద రెడ్డి.

**ఓబులవారిపల్లి ఏప్రిల్ 10 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు నియోజకవర్గంలోని చిట్వేలి పుల్లంపేట పెనగలూరు కోడూరు ఓబులవారిపల్లి మండలాల్లోని స్థానిక సమస్యల పరిష్కారం ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రజా దర్బారు నిర్వహించడం జరిగినదని శుక్రవారం కూడా చైర్మన్, రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి సభా ముఖముగా ప్రజలను ఉద్దేశించి అన్నారు, అన్ని మండలాల స్థానిక నాయకులను ప్రజాప్రతినిధులను సమావేశపరిచి ప్రజా సమస్యలపై వారితో సమీక్ష నిర్వహించారు, పంచాయతీల వారీగా ఆయా ప్రాంత నాయకులతో స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు, అనంతరం మండలాల్లోని స్థానిక పంచాయతీ ల లోని స్థానిక సమస్యలు గ్రామాలలో మౌలిక సదుపాయాలు రోడ్లు డ్రైనేజీ త్రాగునీరు వీధి దీపాలు తదితర సమస్యల పరిష్కారం కొరకు ఈ వేదిక ముఖ్య ఉద్దేశం అని, ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులతో




చర్చించి వీలైనంత త్వరగా స్థానిక సమస్యలు పరిష్కారం జరిగే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు, స్థానిక సమస్యలు ప్రజా సమస్యలు పరిష్కరించడం కోటమీ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని నాయకులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా వారితో మమేకమై పార్టీ అభివృద్ధికి ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు,
అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం కొరకు పరిష్కరించడంలో చొరవసోపాలని ప్రభుత్వం చేపడుతున్న



చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,అన్నారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పులేల రమేష్ బాబు,మండల రెవెన్యూ మరియు అభివృద్ధి, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి సచివాలయ మరియు విద్య వైద్య అధికారులు పాల్గొనడం జరిగినది కూటమి కార్యకర్తలు నాయకులు కార్యకర్తలు ప్రజలు భారీగా పాల్గొని ప్రజాదర్బారు ను విజయవంతం చేశారు

## కడప జిల్లాలో ఇంటర్ విద్యార్థిని గొంతుకోసి చంపిన యువకుడు

కడప **ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**



జిల్లాలోని ఖాజీపేటలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థినిని ఓ యువకుడు గొంతు కోసి కిరాతకంగా హత్య చేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం జరగగా, స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.
వివరాల్లోకి వెళితే... ఖాజీపేటకు చెందిన కీర్తన ఇంటర్మీడియట్ చదువుతోంది. పరీక్షలు పూర్తికావడంతో ఇంటి వద్దే ఉంటోంది. శుక్రవారం ఉదయం ఆమె తల్లిదండ్రులు వ్యాపార పనులపై బయటకు వెళ్లారు. ఇంట్లో కీర్తన ఒంటరిగా ఉన్న సమయంలో వెంకటేశ్ అనే యువకుడు వచ్చి, ఆమె గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు, తమ కుమార్తె రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూసి షాక్‌కు గురయ్యారు.ఆరు నెలల క్రితం నిందితుడు వెంకటేశ్... కీర్తన సోషల్ మీడియాలో ఫొటోలు పెడుతోందని, కంట్రోల్ లో పెట్టుకోవాలని తమకు ఫిర్యాదు చేశాడని తల్లిదండ్రులు తెలిపారు. అయితే, తమ కుమార్తె వద్ద అసలు ఫోనే లేదని, అప్పటి నుంచి ఆమెపై కక్ష పెంచుకుని ఈ దారుణానికి పాల్పడ్డాడని వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఆరోపించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దారుణ హత్యతో ఖాజీపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలి.

## బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ చందు,




**కుప్పం టౌన్,(రిపబ్లిక్ న్యూస్) ఏప్రిల్ 10**

భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్న బిరుదు భారతదేశంలో 53 మందికి నేటి వరకు ఇచ్చి ఉన్నారు. ఈ భారతదేశ స్థితిని గతిని మార్చి మహిళా అభ్యున్నతి కోసం తన జీవితాలను త్యాగం చేసిన మహోన్నత భారత స్ఫూర్తి నాయకుడు మహాత్మ జ్యోతిరావు పూలే కు భారతరత్న ప్రకటించాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చందు డిమాండ్ చేశారు. నేడు కుప్పం నియోజకవర్గం పర్యటనలో భాగంగా కుప్పానికి విచ్చేసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 53 మంది భారతరత్న అవార్డు గ్రహీతల్లో మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులకు సరితూగని రాజకీయ నాయకులు ఉన్నారని,

భారతరత్న బిరుదుకు వన్నెతెచ్చిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి లాంటి మహోన్నత వ్యక్తులు కూడా ఉన్నారని వీరు గుర్తు చేశారు.

ఈ దేశంలో మనుధర్మ సిద్ధాంతాన్ని, మూఢవిశ్వాసాలను, మహిళ పట్ల వివక్షతను, రూపుమాపటానికి జీవిత మొత్తాన్ని ధార పోసిన దంపతులే మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే అని వీరు కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహాత్మ జ్యోతిరావు పూలేని గురువుగా ఎంచుకున్నారని,

ఈ దేశంలో మొట్టమొదటి మహిళా పాఠశాలను, మహిళా ఉపాధ్యాయురాలను తన జీవిత భాగస్వామి సావిత్రిబాయి పూలేని తీర్చిదిద్ది ఈ దేశానికి అంకితం ఇచ్చిన మహోన్నత వ్యక్తిత్వం గల సిసలైన భారతీయులు మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులని వీరు తెలియజేశారు. ఇప్పటికైనా భారతదేశం వారి విగ్రహాలతో పాటు, వారికి భారతరత్న బిరుదు ప్రకటించి దేశం తన గౌరవాన్ని నిలుపుకోవాలని వీరు సూచించారు. రేపు జరగబోవు 199వ జయంతి ఉత్సవాల్లో ప్రతి ఒక్క




నాయకుడు ఈ డిమాండ్ ను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల తమ వానిని వినిపించాలని వీరి విజ్ఞప్తి చేశారు. ఈ పత్రిక సమావేశ కార్యక్రమంలో బహుజన సేన జిల్లా అధ్యక్షులు సతీష్ గారు, కార్యదర్శి గోవిందప్ప, జిల్లా కార్యదర్శి నాగరాజు, గౌరవ సలహాదారులు బాలు, నియోజకవర్గ అధ్యక్షులు మహేష్, రాము, వేలు, అన్న, అన్నమయ్య జిల్లా నాయకులు

మావిళ్ళ వెంకటేష్, మణి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ రామకుప్పం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ





**రామకుప్పం (రిపబ్లిక్ న్యూస్ )ఏప్రిల్ 10**



శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దని, పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తును క్షుణ్ణంగా పరిశీలించారు.– ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని సూచించారు.– హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 Cr.P.C, తదితర కేసుల రికార్డ్సను పరిశీలించారు.– పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు, పురోగతిపై కేసుల ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, నిందితులు అరెస్ట్ కాని కేసులలో త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు.– పోలీసు అధికారులు తరచుగా గ్రామాలను సందర్శించాలని, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.– గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్థులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ASP డా. తరుణ్ పహ్వా, IPS, కుప్పం SDPO శ్రీ పార్థసారథి, ఎస్.బి. ఇన్స్పెక్టర్ శ్రీ మురళీమోహన్, DCRB ఇన్స్పెక్టర్ శ్రీ మనోహర్, రామకుప్పం ఎస్.ఐ. శ్రీ వెంకట మోహన్ మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా విజయవంతం చేయాలి

## సంగారెడ్డి జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాక ఇమ్మయ్య



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్)**

ఏప్రిల్ 11వ తేదీన నిర్వహించనున్న సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించి, విజయవంతం చేయాలని ఎం.బి.సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రామ్ జోషి హన్మంతు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఐబీలో ఈ వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని పలువురు ప్రముఖులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్ జోషి హన్మంతు మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, కుల వివక్షపై పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ, ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు మరియు నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని జయంతిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ కూన సంతోష్, సంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కశపాగ ఇమ్మయ్య, దళిత జర్నలిస్ట్ ఫోరం దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు తలారి యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపాక విజయరాజు, సీనియర్ జర్నలిస్టు దేవదాసు, చంద్రశేఖర్, మునిపల్లి ఆనంద్, ఎర్రారం దేవదాసు తదితరులు పాల్గొని కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు.

# ప్రారంభోత్సవానికి రెడీ అవుతున్న భోగాపురం

## జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన డేట్లు ఫిక్స్ చేసిన ప్రభుత్వం

## ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీకి ఆహ్వానం

విశాఖపట్నం,**ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**



ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఏపీ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూలై మొదటి వారంలో ఈ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇప్పటికే ఆహ్వానం పంపారు. మోదీ షెడ్యూల్ ఆధారంగా జూలై 5వ తేదీ లేదా 8వ తేదీల్లో ఒకటి ఖరారు కానుంది. జూన్ 30వ తేదీ కల్లా మిగిలిన అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తున్నారు. అంతర్జాతీయ విమానాల రాకపోకల కోసం అవసరమైన ఇమ్మిగ్రేషన్ స్టేటస్ నోటిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేసింది. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. విశాఖపట్నం నుంచి భోగాపురం వెళ్లే మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఆనందపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. దీనికి సంబంధించిన డీపీఆర్ 45 రోజుల్లో సిద్ధం కానుంది. భోగాపురం వరకు మెట్రో సౌకర్యాన్ని కల్పించేందుకు సంస్థ సవరించిన డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. ఇది డబుల్ డెక్కర్ మోడల్‌లో ఉండబోతోంది (కింద రోడ్డు, పైన మెట్రో). విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి భోగాపురం వరకు ఈ కారిడార్ విస్తరించనుంది. రోడ్ నంబర్ 12, 14 పనుల కోసం అటవీ, రక్షణ శాఖల అనుమతులను వేగవంతం చేశారు. తీర ప్రాంతం వెంట విశాఖను భోగాపురంతో కలిపే ప్రత్యేక కోస్టల్ కారిడార్ పనులు కూడా ఊపందుకున్నాయి. భోగాపురం ఎయిరోసిటీ, ఐటీ హబ్స్, లాజిస్టిక్ పార్కుల వల్ల ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి లభించనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ విమానాశ్రయం వల్ల ఉత్తరాంధ్రలోని పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. ఫార్మా, మత్స్య పరిశ్రమల ఎగుమతులకు ఈ విమానాశ్రయం కేంద్ర బిందువుగా మారనుంది. భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు త్వరలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. కేందప్రభుత్వ సహకారంతో ఏపీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు జూలై మొదటి వారంలో ప్రారంభించటానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇదో మైలు రాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించటానికి ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

------

# జిల్లాలో తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

## అందరికీ సమానంగా తాగునీరు అందించాలి: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 10)**

జిల్లాలో తాగునీటి సరఫరా మరియు పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి హెచ్చరించారు.

శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నిర్వహించిన తాగునీరు, పారిశుధ్య మిషన్ సమీక్ష సమావేశంలో అన్ని మండలాల ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాల మట్టం తగ్గడం, బోర్‌వెల్స్ తరచుగా పాడవడం వల్ల తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.

తుంగభద్ర డ్యామ్ నుండి విడుదలైన నీటితో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నింపుకున్నామని, ప్రస్తుతం కొనసాగుతున్న నీటి విడుదలతో ఆగస్టు చివరి వరకు నీటి కొరత ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. నీటి వనరులు ఉన్నప్పటికీ సమస్యలు ఎందుకు వస్తున్నాయో అధికారులు సమీక్షించుకోవాలని సూచించారు.

ప్రతి ప్రాంతానికి సమానంగా నీటి సరఫరా జరగాలని, ఎక్కడైనా పక్షపాతం లేదా నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలు రాకుండా క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయని, వాటిని క్రమం తప్పకుండా తొలగించాలని డిపిఓకు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో చెత్త తొలగింపు సరిగా జరగకపోవడం, తాగునీరు వృథా అవుతున్న దృశ్యాలు తన పర్యటనలో గమనించామని చెప్పారు.

ఒకే ప్రాంతంపై పత్రికల్లో పునరావృతంగా ప్రతికూల వార్తలు వస్తే బాధ్యులపై మూడు ఇంక్రిమెంట్లు నిలిపివేసే వరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పైప్లైన్ లీకేజీలు, నీటి వృథా పూర్తిగా నివారించాలని ఆదేశించారు.

మున్సిపల్ ప్రాంతాల్లో వ్యర్థాల విభజన బాగానే జరుగుతున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా మార్చే ప్రక్రియ సరిగా జరగడం లేదని పేర్కొన్నారు. ప్రతి గాబ్రోజ షెడ్ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదనంగా, ఇటీవల కోసిగిలో జరిగిన బాల్య వివాహాన్ని ఆపిన విషయాన్ని ప్రస్తావిస్తూ, బాల్య వివాహాల నిరోధంలో అధికారులు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, జిల్లా పరిషత్ సీఈఓ రమణా రెడ్డి, డీఎంహెచ్ఓ డా. కామేశ్వర రావు, ఐసిడిఎస్ పీడీ విజయ, డిపిఓ భాస్కర్, డీఆర్‌డీఏ పీడీ తదితరులు పాల్గొన్నారు.

# ఆహార కల్తీలపై కఠిన చర్యలు

## చైతన్య కార్యక్రమాలకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు

## కెవిఆర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహణ





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 10)**

జిల్లాలో ఆహార కల్తీల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ సంబంధిత శాఖలకు మార్గనిర్దేశం చేశారు. ఆహార కల్తీలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలని, ఉపాధ్యాయులు మరియు వినియోగదారుల సంఘాల ప్రతినిధులతో కలిసి చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 8:30 గంటలకు కర్నూలు నగరంలోని కెవిఆర్ కాలేజీలో ఆహార కల్తీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆహార పదార్థాలలో కల్తీ ఎలా జరుగుతుంది, కల్తీ ఆహారాలను ఎలా గుర్తించాలి, కల్తీ లేని ఆహారాల లక్షణాలు ఏమిటి వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి కర్ణం కిషోర్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో ఆహార కల్తీలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కల్తీకి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

ఆహార కల్తీ నియంత్రణ అధికారి రాజగోపాల్ మాట్లాడుతూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. డీఎస్ఓ రాజా రఘువీర్ మాట్లాడుతూ, కల్తీ లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షతను జిల్లా వినియోగదారుల సంఘాల ప్రతినిధి ఏ. శివ మోహన్ రెడ్డి వహించగా, వైస్ ప్రిన్సిపాల్ ప్రభు చరణ్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు

# మోనాలిసా వివాహంపై 'పోక్సో' నీడ: చిక్కుల్లో భర్త ఫర్మాన్ ఖాన్!

కుంభమేళాలో పూసలు అమ్ముకుంటూ తన సహజ సిద్ధమైన అందంతో ఓవర్‌నైట్ లో సోషల్ మీడియా సెన్సేషన్‌గా మారిన మోనాలిసా జీవితం ఇప్పుడు ఊహించని మలుపులు తిరుగుతోంది. ప్రేమ వివాహం, లవ్ జిహాద్ ఆరోపణల పర్వం దాటి ఇప్పుడు ఈ వ్యవహారం పోక్సో కేసు వరకు వెళ్లడం సంచలనంగా మారింది. నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ జరిపిన తాజా విచారణలో మోనాలిసా వివాహ సమయానికి మైనర్ అని తేలడం ఇప్పుడు ప్రధాన మలుపు. చట్టపరంగా పెళ్లికి కావాల్సిన వయసు లేకపోవడంతో, ఆమెను వివాహం చేసుకున్న ఫర్మాన్ ఖాన్‌పై తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు తెలుస్తోంది. కేరళలో




జరిగిన వీరి వివాహాన్ని దర్శకుడు సనోజ్ మిశ్రా 'లవ్ జిహాద్'గా అభివర్ణించగా, దానికి ప్రతిగా మోనాలిసా ఆయనపై లైంగిక దాడి ఆరోపణలు చేయడం అప్పట్లో పెద్ద దుమారం రేపింది. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన మైనర్ అంశం కారణంగా, ఫర్మాన్ ఖాన్ జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ప్రేమికులుగా సోషల్ మీడియాలో మెరిసిన ఈ జంట, ఇప్పుడు చట్టపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు.

మోనాలిసా వయసు విషయంలో ప్రభుత్వం దగ్గర ఉన్న ఆధారాలు నిజమేనా? లేక దీని వెనుక ఏదైనా రాజకీయ లేదా సామాజిక కుట్ర ఉందా? అని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

# మహిళా బిల్లుతో పాటు..సమాజ రుగ్మతలపైనా చర్చించాలి

**ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**
భారతదేశం స్వాతంత్ర్యం సముపార్జించి 80వ ఏట అడుగిడబోతున్నాం. సాధించిన విజయాలకన్నా అపజయాలే ఎక్కువగా చర్చించుకోవాలి. దేశంలో నేటికి సరైన విద్యావైద్యం అందడం లేదు. పేదలు పేదలుగానే జీవిస్తున్నారు. గృహవసతి అందని ద్రాక్షగా మారింది. విద్య డబ్బున్న వారికే అందుబాటులో ఉంది. విద్యకోసం మధ్యతరగతి, పేదలు అప్పులు చేయాల్సి వస్తోంది. సరైతన వైద్యం అందుబాటులోకి రావడం లేదు. కనీసం జిల్లాకో మంచి కార్పోరేట్ తరహా ఆస్పత్రి కట్టలేకపోయారు. ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలకు వేలకోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వాలు సొంతంగా ఆస్పత్రులను నిర్మించలేక పోతున్నాయి. అన్నింటికి మించి గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అత్యాచారాలకు లెక్కేలేదు. మహిళల భద్రత డొల్ల అని చెప్పకతప్పదు. అమ్మాయిల అపహరణ కేసులు పెరుగుతున్నాయి. సమజాన్ని పట్టిపపీడిస్తున్న ఈ సమస్యలపై నిరంతరం చర్చించాలి. నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలో మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదిం చేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశం కానుంది. దీనికి చట్టబద్ధత కల్పించడం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. దీంతో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్ల క ల సాకారం కానుంది. 2029 ఎన్నికల నుంచి ఇది అమల్లోకి రానుంది. భారత్‌లోని కోట్లాది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబంగా చూడాలి. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమి స్తుందనే మన సుదీర్ఘ




నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం. దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే ఉన్నా వారికి ఇన్నాళ్లు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కలేదు. ఈ దేశానికి వారు అందిస్తున్న సేవలు అపారమైనవే కాదు... అమూల్యమైనవి. కూడా. అయినా ఇంకా చిన్నచూపు చూస్తూనే ఉన్నారు. పిల్లను క నే యంత్రాలుగా భావిస్తున్నారు. నిజానికి ప్రతిరంగంలోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు ఎందరో దిక్సూచిగా నిలిచారు. శాస్త్ర, సాంకేతిక రంగాల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి లలితకళల వరకు దేశాభివృద్ధిలో మహిళలే అగ్రగామిగా ఉన్నారు. కొన్నేళ్లుగా చేసిన ప్రయత్నాలు స్త్రీ సాధికారత దిశగా అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. చదువుకునేందుకు విస్తృతంగా పెరిగిన అవకాశాలు, మెరుగైన ఆరోగ్య సేవలు, విస్తరించిన ఆర్థిక సమ్మిళితత్వం, అందుబాటులోకి వచ్చిన ప్రాథమిక అవసరాలు..ఆర్థిక, సామాజిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృతం చేశాయి. అయినప్పటికీ.. సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్రకు అనుగుణంగా రాజకీయ రంగంలో, శాసనసభల్లో వారికి తగు ప్రాతినిధ్యం లభించలేదు. ఇది దురదృష్టకరం అని చెప్పుకోవాలి. దాదాపు 80 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం ఇప్పుడు ఈ కల సాకారం కాబోతున్నది. పరిపాలనలో, నిర్ణయాధికారంలో మహిళలు భాగస్వాములైతే.. వారిదైన ఆలోచనలనూ, అనుభవాలనూ జోడించడం ద్వారా ప్రజోపయోగ చర్చలు, పాలనా సామర్థ్యం మరింత మెరుగవు తాయనడంలో సందేహం లేదు. రిజర్వేషన్ల బల్లు ఆఆమోదం దక్కాక రానున్న అంటే... 2029లో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికి మహిళా రిజర్వేషన్లను అమలుచేయడం ఇక అనివార్యం కానుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని అందించేందుకు గత ప్రభుత్వాలు కూడా దశాబ్దాలుగా తమవంతు ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ... చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధీనియంను పార్లమెంటు ఆమోదించింది. భారత చరిత్రలో ఇదో సువర్ణాధ్యాయంగా చెప్పుకోవాలి. మహిళలను శక్తివంతంగా ఎదగడానికి ఇదో ప్రయత్నంగా చూడాలి. వారికి సమున్నత గౌరవం ఇచ్చే చర్యగా భావించాలి. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ అవకాశం మన రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనంగా చూడాలి. ఓ రకంగా ప్రపంచ దేశాలతో పోలిస్తే మనం ఎంతో ముందున్నామని చెప్పుకోవాలి. ఆచరణాత్మక రూపంలో సమానత్వానికి ప్రాతినిధ్యం ఉన్న సమాజాన్ని నిర్మించాలన్న మన రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చడంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రయత్నం నిజంగా అభినందించదగ్గదే. శాసనవ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడం అంటే వారిని మనం గౌరవించుకోవడమే. వారి శక్తిని దేశానికి ఉపయోగించడమే అవుతుంది. ఒక ఇంటిని ఎలా అయితే మహిళ నిర్మిస్తుందో, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రతి మహిళకు సమాన భాగస్వామ్యాన్ని అందించే సమాజాన్ని నిర్మించడంలో మనమంతా అవకాశం ఇవ్వాలి. నిజానికి ఇది ఎప్పుడో జరగాల్సిన సత్కార్యం. మహిళల ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఇప్పటికే జాప్యం జరిగింది. శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల కిందటే గుర్తించినా అడుగు ముందుకు వేయలేదు. ఈ అంశంపై చర్చించారు తప్ప చట్టం చేయలేదు. జనాభాలో సగ భాగంగా ఉన్న వారి ఆకాంక్షలను మన శాసన వ్యవస్థలు ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు లభించే ఆమోదంలో విస్తృత ఏకాభిప్రాయం ముఖ్యం. ఇక్కడ శశభిషలకు తావు లేకుండా ఏకగ్రీవంగా పార్లమెంట్ దీనిని ఆమోదించి తీరాలి. జాతీయ ప్రయోజనాలే పరమావధి అన్న సంకల్పంతో ముందుకు సాగాలి. భారతీయ మహిళల కోసం చేపడుతున్న ఈ ముఖ్యమైన కార్యక్రమానికి మద్దతు అందించాల్సి బాధ్యత అన్న పార్టీలకు ఉంది. ఇకపోతే ఇదే సందర్భంలో దేశాన్ని పట్టిపీడిస్తున్న కొన్న రుగ్మతలనైనా రూపుమాపేందుకు చర్చించాలి. దేశంలో వేళ్లూనుకు పోయిన కులవ్యవస్థపై చర్చించాలి. కులాల వారీగా రిజర్వేషన్లు అనేవి ఉన్నా..కులాల ఉమ్ములాటలు ఆగడం లేదు. దేశ ప్రజలంతా సమానమే అన్న భావన రావాలంటే కుల వ్యవస్థను కూకటివేళ్లతో పెరికివేయాలి. ఈ విషయంపైనా ఇటీవల పలువురు ప్రముఖులు చర్చ లేవనెత్తారు. రాజకీయ పార్టీలు దూరదృష్టితో ఆలోచిస్తే..ఇదేమంత పెద్ద సమస్య కాబోదు.

# హైదరాబాద్-విజయవాడ మధ్య విమాన సర్వీసు

## ఫ్లై 91 విమాన సర్వీసును ప్రారంభించిన రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం/విజయవాడ,ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**
హైదరాబాద్ - విజయవాడ మధ్య ప్రయాణించే వారికి శుభవార్త. ప్రాంతీయ విమానయాన సంస్థ ఫ్లై 91 తన నూతన సర్వీసులను తెలుగు రాష్ట్రాల మధ్య అధికారికంగా ప్రారంభించింది. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య ప్రయాణ దూరాన్ని తగ్గించడంతో పాటు, సామాన్యులకు విమాన ప్రయాణాన్ని చేరువ చేసే లక్ష్యంతో ఫ్లై 91 సంస్థ తన కార్యకలాపాలను విస్తరించింది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ నూతన సర్వీసును శ్రీకాకుళం నుంచి వర్చువల్‌గా పచ్చజెండా ఊపి ఈ సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. తక్కువ ధరలో వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం. విమాన సర్వీసును ప్రారంభించిన అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా టైర్-2, టైర్-3 నగరాలను అనుసంధానించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులు కూడా విమానం ఎక్కాలన్న ప్రధానమంత్రి కల నిజమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ - హైదరాబాద్ మధ్య రద్దీ దృష్ట్యా ఈ సర్వీస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.రోడ్డు మార్గంలో సుమారు 5 నుంచి 6 గంటల సమయం పట్టే ప్రయాణం, విమానం ద్వారా కేవలం 50 నిమిషాల నుంచి గంటలో పూర్తవుతుంది. హైదరాబాద్‌లో ఐటీ రంగం, విజయవాడలో వ్యాపార రంగాలు బలంగా ఉన్న నేపథ్యంలో, ఈ విమాన సర్వీస్ వ్యాపారవేత్తలకు వరంలా మారనుంది. ఫ్లై 91 సంస్థ తన టికెట్ ధరలను ఇతర విమాన సంస్థలతో పోలిస్తే అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేస్తోంది. ఈ సంస్థ గోవా కేంద్రంగా పనిచేస్తున్న ఒక ప్రాంతీయ విమానయాన సంస్థ. ఇది ప్రధానంగా తక్కువ దూరం ఉండే నగరాల మధ్య సర్వీసులను నడుపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో తమ నెట్‌వర్క్‌ను పెంచుకోవడం ద్వారా ప్రయాణికులకు మరిన్నిసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల అటు విజయవాడ ప్రాంత ప్రజలకు, ఇటు హైదరాబాద్ ప్రజలకు రవాణా పరంగా మరిన్ని వెసులుబాట్లు కలగనున్నాయి. ఈ విమాన సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల రోడ్డు ప్రయాణంపై ఒత్తిడి తగ్గనుందని భావిస్తున్నారు.




# హరివంశ్ నారాయణ సింగ్ కు మరో ఛాన్స్

## రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేసిన కేంద్రం -మరోమారు డిప్యూటీ చైర్మన్ అయ్యే అవకాశం

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**
రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ కొనసాగే అవకాశముంది. అనుభవజ్ఞుడైన నాయకుడిగా, నిష్పక్షపాతంగా సభను నడిపించే సమర్థత కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. భారత పార్లమెంట్ ఎగువసభలో అత్యంత హుందాతనం గల నేతగా పేరుగాంచిన హరివంశ్.. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగబోతున్నారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నామినేట్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80 ప్రకారం.. సాహిత్యం, శాస్త్రం, కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. హరివంశ్ తనకున్న సుదీర్ఘ జర్నలిజం అనుభవం, సామాజిక స్పృహతో ఈ కోటాలో ఎంపికయ్యారు. బిహార్ నుంచి జేడీయూ తరపున ఎన్నికైన ఆయన సభ్యత్వ కాలం ఏప్రిల్ 9వ తేదీన ముగిసింది. సాధారణంగా పార్టీ



కోటాలో
సభ్యత్వం ముగిసిన తర్వాత తిరిగి పార్టీ టికెట్‌పైనే వస్తుంటారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్రపతి కోటా ద్వారా నేరుగా సభకు పంపడం గమనార్హం. రాజ్యసభ 13వ డిప్యూటీ ఛైర్మన్‌గా ఆయన పనిచేసిన తీరు అమోఘం. క్లిష్టమైన బిల్లుల చర్చ సమయంలో సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, ఆయన చూపిన ప్రతిభ, నిష్పక్షపాత నిర్ణయాలు అధికార, ప్రతిపక్షాల మన్ననలు పొందాయి. హరివంశ్ నారాయణ్ సింగ్‌ను మళ్లీ సభకు పంపడం వెనుక కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను రచించిన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎగువ సభలో ప్రతిపక్షాల బలం గణనీయంగా ఉన్నప్పుడు, సభను సమర్థవంతంగా నడపగలిగే వ్యక్తుల అవసరం ప్రభుత్వానికి ఉంటుంది. హరివంశ్ ఆ విషయంలో ఇప్పటికే తన సత్తా చాటారు. తాజా నామినేషన్‌తో ఆయన మళ్లీ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశముంది. నామినేటెడ్ సభ్యుడిగా ఉంటూ ఈ బాధ్యతలు చేపడితే, అది సభకు మరింత గౌరవాన్ని తెస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సీనియర్ జర్నలిస్టుగా హరివంశ్‌కున్న విలువలు, రాజకీయాలకు అతీతంగా ఆయనకు ఉన్న ఆదరణ ప్రభుత్వానికి సానుకూల అంశమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాజకీయాల్లో హుందాతనం తగ్గుతున్న కాలంలో, హరివంశ్ నారాయణ్ సింగ్ వంటి సీనియర్ల సేవలను వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని తెలిపారు. రంజన్ గొగొయ్ స్థానంలో ఓ అనుభవజ్ఞుడైన పార్లమెంటేరియన్ రావడం సభ గౌరవాన్ని మరింత పెంచుతుందనడంలో సందేహం లేదని పేర్కొన్నారు. హరివంశ్ నారాయణ్ సింగ్ మళ్లీ డిప్యూటీ చైర్మన్ బాధ్యతలు చేపడితే.. సభలో చర్చల నాణ్యత మరింత మెరుగుపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పోలీసుల కిరాతక చర్యలకు ఓ హెచ్చరిక

## తమిళనాడు మధురై కోర్టు తీర్పుపై సర్వత్రా చర్చ

## పోలీసులపై పనిభారం తగ్గించాలని సూచనలు



**విజయవాడఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):** ఆరేళ్ళ క్రితం తమిళనాడులో జరిగిన 'లాకప్ డెత్' కేసులో ట్రయల్ కోర్టు విచారణ ముగిసి తొమ్మిది మంది పోలీసులను ముద్దాయిలుగా ఖరారు చేస్తూ వారందరికీ మరణ శిక్ష విధించడం సంచలనం కలిగించింది. ఈ తీర్పుపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది. పోలీసుల అతిపై కోర్టు సరైన తీర్పు ఇచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే స్టేషన్‌లో టార్చర్ పెట్టే వారికి ఈ కేసు ఓ హెచ్చరికగా సూచిస్తున్నారు. ఇక వివరాల్లోకి వెళితే...కరోనా సమయంలో సదరు లాక్‌డౌన్ నిబంధనల్ని అతిక్రమించారన్న కారణంతో చిరు వ్యాపారులైన తండ్రీకొడుకులను అరెస్ట్ చేశారు. వారిని ఆ రాత్రంతా చిత్రహింసలకు గురిచేయగా ప్రాణాలు కోల్పోయారు. కస్టడీ లోకి తీసుకున్న ఆరోగ్యవంతులైన ఇద్దరు పౌరులు ఒక్క రోజులోనే అనారోగ్యంతో మరణించడానికి పోలీసులు పెట్టిన చిత్రవధ ఏకైక కారణం అన్నది తేలిపోయింది. ఆ దుర్మార్గపు చర్య ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, ఆందోళన నింపగా మద్రాస్ హైకోర్టు సుమోటోగా కేసుని స్వీకరించి?సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఫలితంగా పోలీసుల నేరం నిరూపణ అయ్యింది. బాధాకరమైన విషయమేమిటంటే ఆ మృతులిద్దరూ కరోనా లాక్‌డౌన్ నిబంధనల్ని కూడా అతిక్రమించలేదని. అది కూడా తప్పుడు బనాయింపు అని. ఆ సంఘటనకి బాధ్యులైన 9 మంది పోలీసు అధికారులకూ నేడు కోర్టు మరణ శిక్ష విధించడం సరైన తీర్పు. ఇంకా పైకోర్టులో అప్పీళ్లు, న్యాయ పక్రియలు పూర్తయ్యి అంతిమ తీర్పు రావడం ఎలాఉన్నా ప్రస్తుతానికి బాధిత కుటుంబాలకు ఊరట. అధికారాన్ని అడ్డుపెట్టుకుని,చేయగూడని పనులు చేసే అధికారులకు ఇది ఒక హెచ్చరిక. ఇదే సమయంలో దేశం పోలీసు సంస్కరణల దిశగా ఆలోచించాలి. వారు ఎదుర్కొంటున్న విపరీత పని ఒత్తిడి సమస్య, సిబ్బంది లేమి, దర్యాప్తు, శాంతి భద్రతలను వేర్వేరుగా నిర్వహించే యంత్రాంగం లాంటివి తీర్చుతూనే, తప్పుడు పనులు చేసే అధికారుల్ని వెంటనే కఠినంగా శిక్షించే ఏర్పాట్లు ఉండాలని అంటున్నారు. సమాజానికి అప్పుడే శాంతిభద్రతలకు భరోసా ఉంటుందని భావిస్తున్నారు.

# కాలిన నోట్ల కట్ట ల వ్యవహారం

## పదవికి రాజీనామా చేసిన జస్టిస్ యశ్వంత్ వర్మ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):**



అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఢిల్లీలోనితన నివాసంలో కాలిన నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆయనను తొలగించేందుకు అభిశంసన పక్రియకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. గతేడాది మార్చి 14న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైన విషయం తెలిసిందే. దీంతో ఇక లాభం లేదనుకుని ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

---------------

# పారిశ్రామిక అభివృద్ధికి వేగం

## ఉపాధి అవకాశాల విస్తరణకు కలెక్టర్ పిలుపు

**రెన్యూవబుల్ ప్రాజెక్టులపై సమీక్ష భూసేకరణ సమస్యల పరిష్కారానికి చర్యలు**

**జిల్లాలో పరిశ్రమల వాటా పెంపుపై దృష్టి స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు**

**పారదర్శక భూమి కేటాయింపులు సింగిల్ డెస్క్ విధానానికి ప్రాధాన్యం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసి, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వివిధ ప్రాజెక్టుల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిపాలనా మరియు స్థానిక సమస్యలపై సమీక్ష చేపట్టారు. సోలార్, విండ్, సీబీజీ, బిఇఎస్ఎస్ వంటి మొత్తం 17 ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీవోలు ప్రాజెక్టుల కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం జనాభాలో 78 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని తెలిపారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లా జిడిపిలో పారిశ్రామిక రంగం వాటా కేవలం 19 శాతం మాత్రమే ఉండగా, వ్యవసాయం 42 శాతం, సేవా రంగం 39 శాతం వాటాను కలిగి ఉన్నాయని వివరించారు. ప్రత్యేకంగా సెకీ ప్రాజెక్ట్ పురోగతిపై సమీక్షిస్తూ, కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామంలో ఇప్పటికే 38.10 ఎకరాల భూమి కేటాయించగా, అదనంగా అవసరమైన 9.20 ఎకరాల్లో 6.32 ఎకరాలకు సర్వే పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన భూమికి సంబంధించి తహశీల్దార్ కార్యాలయం నుండి ఎలియనేషన్ లెటర్‌ను త్వరితగతిన పొందాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల భాగంగా గ్రీన్‌కో సంస్థ కటికవానికుంట ప్రాంతంలో సుమారు 4,118 ఎకరాల భూమిని కోరగా, భూమి లభ్యతపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆర్డీఓను ఆదేశించారు. అదేవిధంగా ఏపీ జెన్‌కోకు అవసరమైన రహదారి సౌకర్యం కోసం ప్రభుత్వ భూములను గుర్తించాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక అవసరాల కోసం దాదాపు 6,000 ఎకరాల భూమి అవసరమని అంచనా వేయగా, ప్రస్తుతం సుమారు 5,800 ఎకరాలు అవసరమని గుర్తించారు. గోరుగట్ల, తట్టెకొండపల్లి, చెన్నకేశవపల్లి ప్రాంతాల్లో సుమారు 7,500 ఎకరాల భూమిని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. ఈ భూములు ప్రభుత్వమా, అసైన్డ్ భూములా అన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భూమి కేటాయింపుల ప్రక్రియలో పారదర్శకతను పాటిస్తూ, ఒక వారంలో ఫిజిబిలిటీ రిపోర్ట్, తదుపరి వారంలో ప్రతిపాదనలు సమర్పించి మొత్తం ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ధేశించారు. రీ-సర్వేలో 5 శాతం వరకు వ్యత్యాసాలను అనుమతిస్తూ, అంతకంటే ఎక్కువ ఉంటే కేసు వారీగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రైవేట్ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ శాఖ నుంచి క్లియరెన్స్ తీసుకోవాలని సూచించారు. భూమి మార్పిడి ప్రక్రియలో సింగిల్ డెస్క్ విధానాన్ని అనుసరించాలని, దేవదాయ శాఖ భూములకు సంబంధించిన వివరాలను కమిషనర్ కార్యాలయానికి పంపాలని తెలిపారు. ఏపీఐఐసీభూమి సమస్యలను జోనల్ స్థాయిలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అలాగే రీ-సర్వే రికార్డులు మరియు పాత రికార్డుల మధ్య వ్యత్యాసాలను సరిచేసి వెబ్‌ల్యాండ్ 2.0లో నవీకరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఏ ఎం పి ఎన్ హెచ్ ప్రాజెక్ట్ కింద 1,360 ఎకరాల భూమిలో 507 ఎకరాల రిజిస్ట్రేషన్ పూర్తైందని, మిగిలిన 850 ఎకరాలు త్వరలో పూర్తవనున్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్లను రెండు రోజుల్లో పూర్తి చేసి, నెడ్‌క్యాప్ పేరుమీద నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇద్దంపల్లి, అమడగుంట్ల గ్రామాల్లో మ్యూటేషన్లు పెండింగ్‌లో ఉండగా, వెబ్‌ల్యాండ్ 2.0లో సాంకేతిక సమస్యల కారణంగా సుమారు 30 ఎకరాల ప్రక్రియ నిలిచిపోయినట్లు తెలిపారు. మొత్తం 9,645 ఎకరాల భూమిని హ్యాండోవర్ చేయగా, అందులో 70 శాతం భూమికి హద్దులు నిర్ణయించినట్లు వెల్లడించారు. భూమి సర్వేలు, బౌండరీల నిర్ధారణ, 580 ఎకరాల భూమి అప్పగింతలో ఉన్న జాప్యం, ఎలక్ట్రికల్ లైన్ల సమన్వయం, పనికిరాని భూముల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎర్రగుడి ప్రాంతంలో కోఆర్డినేట్ల వ్యత్యాసాలను సరిచేసి సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన భూమి కేటాయింపులు, పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేసి పెట్టుబడులను ఆకర్షించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను పటిష్ఠంగా అమలు చేస్తున్నాం

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఏప్రిల్, 10 (రిపబ్లిక్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో జాతీయ స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ అజయ్ కుమార్ సాహు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎకనామిక్ ఆఫీసర్ రూబల్ కుమార్, డ్వామా పిడి సూర్యనారాయణ మూర్తి, హౌసింగ్ పిడి శ్రీహరి గోపాల్, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి, ఎల్డిఎం రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుండి అమలు చేస్తున్న పథకాలైన హౌసింగ్, ఉపాధి హామీ పనులు, పంచాయతీ రాజ్ పనులు, నైపుణ్య అభివృద్ధి పనుల పరిశీలన నిమిత్తం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు రావడం జరిగిందన్నారు. వారు జిల్లాలోని బనగానపల్లె, రుద్రవరం, కొలిమిగుండ్ల, నంద్యాలలో పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. హౌసింగ్, ఉపాధి హామీ పనులు ఒకే ఐడి వచ్చేలా చూడాలని, చాబోలులో గ్రామంలో సాగి పథకం క్రింద ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ పనులతో మిగతా పనులు కూడా పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా డిసిల్టింగ్, ఫీల్డ్ ఛానెల్స్ పనులు కూడా పూర్తి చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రణాళికల వారీగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ అజయ్ కుమార్ సాహు మాట్లాడుతూ ముఖ్యంగా ఉపాధి హామీ పనులకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఈసీలు, ఎస్పీఓలకు వారి వీధుల పట్ల మంచి



అవగాహన కలిగి ఉన్నారని ఏ రాష్ట్రంలో కూడా ఇంతటి సమన్వయంతో పనులు జరగట్లేదని జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.

# న్యాయ శాఖ పటిష్టత కోసం చర్యలు

## పబ్లిక్ లిటిగేషన్ పాలసీ- పై మంత్రి వర్గ ఉపసంఘం భేటి



**అమరావతి, ఏప్రిల్ 10( రిపబ్లిక్ న్యూస్) :** రాష్ట్రంలో న్యాయ శాఖ పటిష్టత కోసం ప్రణాళికబద్ద చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ చేపట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం (ఏపీ స్టేట్ పబ్లిక్ లిటిగేషన్ పాలసీ ) ను పరిశీలించడానికి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం శు క్రవారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత,వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లు న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. న్యాయ శాఖ లోతప్పనిసరి వ్యాజ్యాలను తగ్గించడం, సకాలంలో ప్రభావవంతమైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం,పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉప సంఘం ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం పై పలు నిర్ణయాలను రూపొందించడంలో భాగంగా మంత్రులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడారు. అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, కేసుల పరిష్కార వేగవంతానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని మంత్రి తెలిపారు.ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అప్పీళ్లను న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి చర్యలను కూడా మంత్రుల సంఘం సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని సమీక్షించడం, ప్రోత్సహించడం,లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం తదితర అంశాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. న్యాయశాఖ ను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలలో ఇప్పటికే అమల్లో ఉన్న లిటిగేషన్ పాలసీని పరిశీలించి, అక్కడ చేపట్టిన చర్యలు, సంస్కరణలు, ఇతర అంశాలను కూలంకషంగా పరిశీలించి, మన రాష్ట్రంలో లిటిగేషన్ పాలసీని పటిష్టంగా అమలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, అనిత, సత్య కుమార్ లు సూచించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# హత్య కేసును తక్కువ చేధించిన పోలీస్ అధికారి ఎస్ ఐ, నాగార్జున రెడ్డి



**గడివేముల ప్రతినిధి, ఏప్రిల్,10,(ప్రజా రిపబ్లిక్ న్యూస్,)** మండలంలో సంచలనం సృష్టించిన భోగేశ్వర ఆలయ వాచ్‌మన్ హత్య కేసును తక్కువ సమయంలోనే ఛేదించిన గడివేముల పోలీసు సిబ్బందిని ఎస్పీ శ్రీ సునీల్ షెరైన్ ప్రశంసించారు.కేసు దర్యాప్తులో చురుకుదనం, సమయస్ఫూర్తితో వ్యవహరించి నిందితులను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన ఎస్సై సీసీ నాగార్జున్ రెడ్డి, కానిస్టేబుల్‌లు రామకృష్ణ, రామాచారీ లను ప్రత్యేకంగా అభినందించారు.

# వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ మరో ఏడాది (2026-27)పొడిగింపు

**అమరావతి,ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ ను మరో ఏడాది అనగా 2026-27 కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈమేరకు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ జిఓఎంస్ సంఖ్య 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జిఓం ఎంస్ సంఖ్య 12 ద్వారా 2015లో అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా అదే విధంగా ఫ్రీలాన్స్,వెటరన్ జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం మాదిరిగా వివిధ ఎంపానల్డ్ ఆసుపత్రుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా క్యాస్ లెస్ వైద్య సేవలు అందించే లక్ష్యంతో వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ను ప్రవేశపెట్టడం జరిగింది.దీర్ఘకాలిక వ్యాధులు మరియు అత్యవసర శస్త్రచికిత్సలతో సహా ప్రభుత్వం నిర్ణయించిన వందలాది వైద్య విధానాలు ఈ పథకం కింద కవర్ చేయబడతాయి. కాలానుగుణంగా ఈపథకాన్ని ప్రతి ఏటా అనగా 2016-17 నుండి 2025-26 వరకూ పొడిగించడం జరిగింది.మరలా ఈవర్కింగ్ జర్నలిస్టుల కాంప్రెహెన్సివ్ హెల్తు స్కీమ్ ను మరో ఏడాది కాలానికి అనగా 2026-27 కు పొడిగించాలన్న సాధారణ పరిపాలన శాఖ(ఐఅండ్ పిఆర్)విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ పొడింగింపు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరియు సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆఉత్తర్వుల్లో పేర్కొన్నారు

# కేసుల దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించండి.

**జిల్లా పోలీసు అధికారులుతో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్. నేర సమీక్షా సమావేశం**




**నంద్యాల జిల్లా క్రైమ్ ఏప్రిల్ 10 (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల జిల్లాలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ జిల్లా పోలీసు అదికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నందు పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి సమీక్షా నిర్వహించి నేరనియంత్రణకు, పెండింగ్ కేసుల దర్యాప్తు, నేరస్థులను గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని (సుధర్శన్, గాండీవ్, మొదలగు వాటిని ఉపయోగించుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదిదారులతో గౌరవప్రదంగా మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేయండి. కేసుల దర్యాప్తు, పరిష్కారం, ప్రాపర్టీ నేరాలలో ముద్దాయిల అరెస్ట్, బందోబస్తు విధులు మొదలగు వాటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 36 మంది పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ల వారీగా యూ ఐ కేసులు తగ్గించుకోవాలన్నారు. నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలన్నారు. మహిళల భద్రత, సైబర్ క్రైమ్, శాంతి భద్రతల పరిరక్షణ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, చీటింగ్, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులపై సమీక్షించారు. వాటి పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అలవాటు పడిన నేరస్తుల కదలికలపై నిఘా ఉంచండి. మరియు ప్రాపర్టీ నేరాలు చేసిన వారిపై అవసరమైతే షీట్స్ ఓపెన్ చెయ్యండి. బీట్లు, పికెట్స్ ఏర్పాటు చేసుకొని అధికారులు తరుచుగా బీట్ చెక్ చేస్తూ సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు. దొంగతనాలు, దోపిడీలు, తదితర నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా మరియు భౌతిక దాడులు జరుగకుండా చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే రోడ్డు రవాణా సంస్థ, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో నియంత్రణ చర్యలు చేపట్టాలి.మహిళలు భద్రత కొరకు వారు ఎక్కువగా సంచరించు ప్రదేశాలలో ప్రత్యేక దృష్టి ఉంచి పెట్రోలింగ్ పెంచడంతో పాటు నిఘా కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవడంతోపాటు పాత సీసీ కెమెరాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచండి.

కోర్టులో ఉన్న పెండింగ్ కేసులను త్వరగా ట్రయల్ కు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం.జావళి ఆల్ఫోన్స్ , రామంజి నాయక్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి మరియు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com